
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం
30 నవంబరు, 2025





# కాళ్లకు రెక్కలే
# పర్యాటక దిక్కులు

# బాలకృష్ణ జోడీగా నయనతార

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'NBK111'. ఈ సినిమాలో కథానాయికగా లేడీ సూపర్‌స్టార్ నయనతార నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. నయనతార పుట్టినరోజును పురస్కరించుకుని ఈ విషయాన్ని వెల్లడించింది.

ఈ సందర్భంగా దర్శకుడు గోపీచంద్ మలినేని తన ఎక్స్ ఖాతాలో "క్వీన్ నయనతార గారికి NBK111 ప్రపంచంలోకి స్వాగతం. మా కథలో ఆమె శక్తి, గాంభీర్యం ఉన్నందుకు గౌరవంగా భావిస్తున్నాం. నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ కూడా నయనతారకు స్వాగతం పలుకుతూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది.



'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇది ఒక చారిత్రక ఇతివృత్తంతో రూపొందుతుండగా, బాలకృష్ణను మునుపెన్నడూ చూడని సరికొత్త అవతారంలో చూపించనున్నట్లు సమాచారం.

తారాతీరం

# మిలటరీ మేజర్‌గా పవన్‌కల్యాణ్?

పవన్‌కల్యాణ్ హీరోగా సుజిత్ దర్శకత్వంలో రూపొందిన వయొలెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇటీవల విడుదలై సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత హరీష్ శంకర్ కాంబినేషన్‌లో 'ఉస్తాద్ భగత్‌సింగ్' చేస్తున్నారు పవన్. ఈ సినిమా తర్వాత పవర్ స్టార్ చేయబోయే సినిమా ఏంటి? అనే క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో, అభిమానుల్లో విపరీతంగా ఉంది.

పవర్ స్టార్ నెక్స్ట్ ప్రాజెక్ట్‌కి సంబంధించిన తాజా సమాచరం అభిమానులను ఆనందింపచేసింది. 'అతనొక్కడే', 'కిక్', 'రేసుగుర్రం', 'ఊసరవెల్లి' మొదలైన సూపర్‌హిట్ చిత్రాలను తెరకెక్కించిన సురేందర్‌రెడ్డి కాంబినేషన్‌లో పవన్‌కల్యాణ్ ఓ చిత్రం చేయబోతున్నారు. పవన్‌కల్యాణ్‌నడేట్స్ దక్కించుకున్న నిర్మాత తాళ్లూరి నిర్మించే ఈ సినిమాలో పవన్‌కల్యాణ్ ఒక కీలకపాత్ర పోషిస్తున్నారు. మిలటరీ మేజర్‌గా పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో పవన్‌కల్యాణ్ కనిపించబోతున్నారు. ఈ క్యారెక్టర్‌ని సురేందర్ రెడ్డి అద్భుతంగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో మరో కథానాయకుడు ఉండనున్నట్లు సమాచారం. ఆ హీరో ఎవరనేది త్వరలో తెలుస్తుంది.



ఆదివారం వార్త

30 నవంబరు, 2025

## మంచి ముత్యాలు

– నిర్మొహమాటంగా ఎదుర్కోని యుద్ధాలకు వెన్నుపోటు పొడిచే తత్వం వుంది. – సర్ హెరాల్డ్ బౌడెన్

– సంభాషణలో ఒక గొప్ప కళ మౌనం. – హాజ్లిట్

## కదంబం

'సంఘీ'భావం....5
మావోల ఉద్యమంపై ఉక్కుపాదం

కవర్ స్టోరీ..6
కాళ్లకు రెక్కలే పర్యాటక దిక్కులు !

ఈ వారం కవిత్వం...12
నా ప్రతిబింబం ఆగిపోయింది

కథ..20
మా ఊరెక్కడ?

వర ప్రదాయక వినాయకుల ఆలయం.. 28

ఇంకా...
మొగ్గ
వాస్తు
వారఫలం
వగైరా.. వగైరా..

# సమాచారం

## వర్షం పడితే..



కొన్ని నగరాల్లో ఓ మాదిరి చిన్న వర్షం కురిసినా వెంటనే రోడ్ల మీద గుంతలు, మూతలు తెరిచిన డ్రైనేజీలు కనిపిస్తుంటాయి. కానీ దక్షిణ కొరియాలోని సియోల్ వీధుల్లో వానజల్లు మొదలవ్వగానే రోడ్ల మీద అందమైన చేపలు, తాబేళ్లు, సీతాకోకచిలుకలు ఇంకా చూడచక్కని కళా దృశ్యాలు కనిపిస్తాయి. ఇంతకు అసలు సంగతేమిటంటే– ప్రజల్ని ఆకట్టుకోవడానికి వినూత్నంగా రోడ్ల మీద ఈ విభిన్నమైన ప్రయోగం చేసినట్లు తెలుస్తోంది. నీళ్ల పడితేనే కనిపించే హైడ్రోక్రోమిక్ పెయింట్లతో రకరకాల బొమ్మల్ని వేసారు. సాధారణ సమయంలో సాదాగా ఉన్న రోడ్లు నీళ్ల పడగానే ఆ పెయింటింగ్స్ బయటకు కనిపిస్తాయన్నమాట.

### గ్లాస్ టాయిలెట్స్

పబ్లిక్ టాయిలెట్స్‌కి వెళ్లడానికి చాలామంది ఆలోచిస్తుంటారు. నీట్‌గా ఉంటుందో, ఉండదో.. వెళ్తే ఆరోగ్య సమస్యలు వస్తాయేమోనని భయపడుతుంటారు. ఈ సందేహాన్ని నివృత్తి చేస్తూ జపాన్‌లో గ్లాస్ టాయిలెట్స్ ఏర్పాటు చేసారు. బయటి నుంచే లోపల ఎలా ఉందో చక్కగా కనిపిస్తుంది. లోపలివాళ్లు బయటివాళ్లకి కనిపిస్తారు కదా అని భయపడాల్సిన అవసరం లేదు. వీటిని ప్రత్యేకమైన స్మార్ట్ గ్లాస్‌తో నిర్మించినందువల్ల లోపలివాళ్లు బయటివాళ్లకు కనిపించరు. లోపలికి వెళ్లి డోర్ లాక్ చేయగానే గ్లాజు కలర్ మారిపోతుంది. కనుక లోపలివాళ్లు బయటివారికి కనిపించరు. గాజుకు రెండు షేడ్స్ వున్నందువల్ల లోపల ఎవరో వున్నారన్న విషయం బయట వున్నవాళ్లకు అర్థమవుతుంది. పబ్లిక్ టాయిలెట్స్ మీద నమ్మకం పెంచడం కోసం ఈ వినూత్న ఆలోచన చేసారట.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com




## ఇంటర్వ్యూ

తండ్రి: "ఇంటర్వ్యూలో అన్నింటికీ సమాధానాలు చెప్పి ఆఖరు ప్రశ్నకి మాత్రం సమాధానం చెప్పలేకపోయావా! ఏమడిగారు?"

కొడుకు: "క్యాషా? రికమండేషనా?" అని..

## మా ఆవిడే..

మొదటి వ్యక్తి: "ఈ ఇంట్లో అద్దెకు దిగుతున్నారా? మీకు తెలియదా?"

రెండవ వ్యక్తి: "ఏంటీ?"

మొదటి వ్యక్తి: "ఈ ఇంట్లో దెయ్యాలున్నాయి"

రెండవ వ్యక్తి: "మా ఆవిడే పెద్ద దెయ్యం.. ఇంక నాకెందు భయం?"

## పుట్టింటికెళ్ళింది

కామేశ్: "ఏం రాకేష్ నీ ముఖం కళకళలాడిపోతోంది?"

"మా ఆవిడ పుట్టింటికి వెళ్ళింది" అన్నాడు రాకేశ్.

కామేశ్: "అదా సంగతి?"

## అప్పులున్నాయిగా!

సుబ్బారావు: "ఏం అప్పారావ్, స్కూటరు లేదు, మోటారు సైకిల్ లేదు., హెల్మెట్ వేసుకుని ఉన్నావు?"

అప్పారావు: "అప్పులు ఉన్నాయిగా.. అందుకని" లౌక్యంగా సమాధానమిచ్చాడు.

## తాతా అంటున్నారు..

సుబ్బారావు: "ఎప్పుడూ జుట్టుకి రంగు వేసుకోవుగా! ఇప్పుడు రంగు వేసుకున్నావేంట్రా?"

రంగారావు: "మా ఎదురింట్లో వున్న అమ్మాయిలు నన్ను తాతా అని పిలుస్తున్నారు."

సుబ్బారావు: "ఓర్నీ.."

– వైదా ఈశ్వరరావు

## అబద్ధం చెప్పనని..

విజ్జి: "ఎమండీ, మన పెళ్లికి ముందు నన్ను ప్రేమించినప్పుడు బుజ్జీ, బంగారం, చిన్నీ అని పిలిచేవారు. ఇప్పుడు అలా పిలవడం లేదు.. ఎందుకని?"

నాని: "అదా! మరి పెళ్లి తరువాత నీతో అబద్ధం ఆడను.. అని ఒట్టు వేసానుగా!"

## నాన్న ఏడవడుగా..

పండు: "ఏరా, మీ అమ్మ కొట్టినా ఏడవలేదేమి?"

తేజ: "మరి మా నాన్న కూడా ఏడవడుగా"

## గొడుగు ఉందిగా..

విజయమ్మ: "ఏరా రాము, మొక్కలకు నీళ్లు పోయలేదేమీ?"

రాము: "బాగా వర్షం పడింది అమ్మగారూ!"

విజయమ్మ: "నీ బద్ధకం మండిపోను.. గొడుకు ఇక్కడ ఉంది కదరా.."

## తెలివి తక్కువవాడిని..

రామారావు: "ఒరే పండూ, ఇరవై సంవత్సరాల క్రితం నీ స్కూల్‌లో చదివానురా."

పండు: "అందుకేనా ఇరవై సంవత్సరాల క్రితం నాలాంటి తెలివి తక్కువవాడిని చూశాను అని అన్నారు."

– ఈ.ఎస్.మాధవన్

## కోడి చెప్పలేదు..!

టీచర్: "చింటూ! కోడి ముందా? గుడ్డు ముందా?"

చింటు: "ఏమో టీచర్. మా కోడిని ఎన్ని సార్లు అడిగినా ఏం చెప్పలేదు.

టీచర్: ఆ......!

– మా. శ్రీ. రాజు

# హాస్య కవిత



ఓ.... దీపికా
నిన్ను తలచుకున్న వెంటనే నీ దర్శనం
నా ప్రేమకు నిదర్శనం
హృదయమనే పెన్నులో
ప్రేమ అనే ఇంకు పోసి
అందమైన దీపాల వరుస లాంటి
అక్షరాలతో రాస్తున్నా..
నీకు ప్రేమలేఖ.

ఓ.. శశిరేఖా...
నా ప్రేమ మొగిలిరేక
కోటి దీపకాంతులు విరజిమ్మే
నయనాలదానా
కాకరవత్తుల కాంతిలో రావే నా ప్రేమ కాంతమా!
నీ బిత్తరచూపులు లాగాయి
అయస్కాంతంలా..

భూచక్రంలా తిరిగాను
నేను.. నీ చుట్టూ
రాకెట్‌లా దూసుకుపోవాలి
మన ప్రేమ ప్రయాణం
చిచ్చు బుడ్డీలా వెలగాలి
నా జీవితం అనుకొన్నా..
ఇచ్చాను నీకు నేను
ప్రేమలేఖ

ఇచ్చావు నాకు నువ్వు
శుభలేఖ

నా మీద నీకు ప్రేమలేక
నువ్విచ్చిన శుభలేఖ చూసి
పేలిపోయింది నా హృదయం లక్ష్మీబాంబులా
పోనీ స్నేహమనే ఫెవికోలైనా ఇస్తావా?
నా హృదయాన్ని అతికించుకొంటా!

– సంపంగి వారి జయచంద్రారెడ్డి

## 'సంఘీ' భావం



# మావోల ఉద్యమంపై ఉక్కుపాదం

గతంలో ఎన్నడూ లేని విధంగా మావోయిస్ట్‌ల ఉద్యమాలు అంతరించే పరిస్థితి కనబడుతోంది. మావోలు లేని దేశంగా భారత్‌ను మార్పు చేస్తామని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడమే కాకుండా కఠినంగా అమలుచేస్తోంది. ఏకంగా ఆర్మీ బెటాలియన్లను అటవీ ప్రాంతంలోకి పంపించడంతో మావోయిస్ట్‌ల ఏరివేత కార్యక్రమం జోరుగా సాగుతోంది. వచ్చే సంవత్సరం మార్చి చివరినాటికి మావోయిస్ట్‌లు పూర్తిగా అంతం కావాలని కేంద్రం లక్ష్యంగా చేసుకుంది. దీనిపై కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా ప్రత్యేక దృష్టి సారించారు. దీనితో 2014 నుంచి మావోయిస్ట్‌ల ఏరివేత కార్యక్రమం జోరందుకుంది. కగార్ ఆపరేషన్ పేరుతో కేంద్ర బలగాలు అడవుల్లోకి చొచ్చుకువెళ్లాయి. అశ్వమేధ యాగం నిర్వహించిన రీతిలో కేంద్ర బలగాల అటవీ ప్రాంతంలో దూసుకెళ్తూ ఎక్కడికక్కడ పికెట్లు ఏర్పాటు చేశారు. ఇదే సమయంలో గిరిజనులతో సఖ్యతను పాటించడంతో ఆపరేషన్ మరింత సులువుగా ముగించేందుకు అవకాశం కలిగింది. అత్యాధునిక ఆయుధాలు. హెలికాప్టర్లు, డిజిటల్ ఇమేజింగ్ విధానం, డ్రోన్లు, శాటిలైట్ వ్యవస్థను పూర్తి స్థాయిలో ఉపయోగించడం ద్వారా మావోయిస్ట్‌ల కదలికలను ఎప్పటికప్పుడు స్పష్టంగా తెలుసుకునే అవకాశం కలిగింది. ఒకపక్క ఎన్‌కౌంటర్లు జోరందుకుంటే మరోపక్క వేలాది మంది మావోయిస్ట్‌లు లొంగిపోవడం ప్రారంభించారు. వీరితో పాటు కేంద్ర కమిటీ స్థాయి సభ్యులు సైతం లొంగుబాట పట్టారు. దీనితో ఇప్పటి వరకు అధికారులు పేర్కొంటున్న ప్రకారం 90 శాతం మావోయిస్ట్‌లను ఉద్యమం నుంచి తొలగినట్లు చెబుతున్నారు. ఈ నెల 17న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లాలో ఒకేసారి 210 మంది మావోయిస్టులు లొంగిపోవడం సంచలనం సృష్టించింది. గత పదేళ్ల పరిణామాలను పరిశీలిస్తే, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, ఒడిశా, తెలంగాణ, ఏపీ, మహారాష్ట్రల్లో మావోయిస్టు ఉద్యమం బాగా బలహీనపడింది. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, ఒడిశా, తెలంగాణ, ఏపీ, మహారాష్ట్రల్లోని అటవీ ప్రాంతాల్లో మావోయిస్టుల కార్యకలాపాలు, దాదులు తగ్గిపోయాయి. 2017 సం॥ వరకు ఈ రాష్ట్రాల్లోని మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య 126 ఉండగా 2018 ఏప్రిల్ నాటికి ఈ సంఖ్య 90కి తగ్గిపోయింది. 2021 జులై నాటికి 70 జిల్లాలకు, 2024 ఏప్రిల్ నాటికి 38 జిల్లాలకు చేరింది. ప్రస్తుతం ఈ జిల్లాల సంఖ్య 6 నుంచి 3కు తగ్గిందని వెల్లడించింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుక్మా, నారాయణ్‌పూర్ జిల్లాలో అతి కొద్ది మంది ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది. మావోయిస్టుల ప్రభావం కలిగిన జిల్లాలకు ఏటా రూ.10 కోట్ల నిధులను అందిస్తోంది. వీటితో ఆయా చోట్ల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు.

కేంద్ర సర్కారు పకడ్బందీగా రచించిన పద్మవ్యూహం నుంచి బయట పడలేక మావోయిస్టుల్లోని చిన్న స్థాయి క్యాడర్ నుంచి అగ్రనేతల దాకా లొంగుబాటు బాట పట్టారు. మావోయిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాలరావు సహా 61 మంది మావోయిస్టులు మహారాష్ట్రలోని గడ్చిరోలిలో లొంగిపోవడంతో మావోయిస్ట్‌ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. 2024లో దేశంలో 290 మంది మావోయిస్టులు హతమయ్యారు. 1,090 మంది అరెస్టయ్యారు. 881 మంది సరెండర్ అయ్యారు. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో 477 మంది మావోయిస్టులు హతమయ్యారు. 1,785 మందిని అరెస్టు చేయగా, 2,100 మంది సరెండర్ అయ్యారు. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 13,000 మందికి పైగా మావోయిస్టు ఉద్యమం నుంచి బయటికొచ్చి జనజీవన స్రవంతిలో కలిశారు. తాజాగా హిడ్మా వంటి నేత కూడా ఎన్‌కౌంటర్‌కు బలికావడంతో కేంద్రం ఆశించిన మేరకు కగార్ ఆపరేషన్ విజయవంతమైందని చెప్పుకోవచ్చు. అయితే సుదీర్ఘ చరిత్ర కలిగి దేశంలోనే కాకుండా అంతర్జాతీయ నెట్‌వర్క్ కలిగిన మావోయిస్ట్ వ్యవస్థ పూర్తిగా అంతమవుతుందా? అన్న అంశం అనుమానా స్పదంగా ఉంది. అయితే గతంతో పోలిస్తే జమిందారీ వ్యవస్థ, భూకామందుల ఆగడాలు చాలా వరకు తగ్గుముఖం పట్టాయి. గిరిజన ప్రాంతాలు చైతన్యం పొందుతూ వచ్చాయి. అప్పట్లో గిరిజనులకు మావోయిస్ట్‌ల అవసరం ఎక్కువగా ఉండేది. అయితే మారుతున్న కాలంలో పోలీసింగ్ గిరిజన గ్రామాల స్థాయిలో పటిష్టం కావడంతో తమ సమస్యల పరిష్కారం కోసం గిరిజనులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. దీనితో మావోల ప్రాబల్యం గణనీయంగా తగ్గింది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

బండారు రామ్మోహన రావు

# కాళ్లకు రెక్కలే పర్యాటక దిక్కులు

**ఆధునిక సమాజంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి రవాణా కమ్యూనికేషన్ల వృద్ధితో 'ప్రపంచమే ఒక కుగ్రామంగా' మారిన పరిస్థితిని మనం చూస్తున్నాం. ఈ నేపథ్యంలో ప్రపంచ పర్యాటక రంగంలో మన భారతదేశ స్థానం ఎంత అందులో మన తెలుగు రాష్ట్రాల పర్యాటక రంగం ఎలా పుంజుకుంటుంటోంది.. అనే అంశాలతో కూడిన ఈ వారం ప్రత్యేక వ్యాసం.**

"కుదిరితే పరిగెత్తు లేకపోతే నడువు. అదీ చేతకాకపోతే పాకుతూ పో. అంతేకానీ... అలా కదలకుండా ఒకే చోట ఉండిపోకు" నీవు పడుకున్న పరుపు చీదరించుకోకముందే పరిగెత్తు, నడువు, పాకుతూ పో అంతేకానీ ప్రయాణాన్ని ఆపకు" అంటారు మహాకవి శ్రీశ్రీ...

జీవన ప్రస్థానంలో మనిషి సంచార జీవి. మనిషి సంఘజీవి. సంచార జీవితం కూడా అందుకే ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది యాత్రికులు ఆనాడు ఎలాంటి సౌకర్యం లేని పరిస్థితులలో చైనా నుంచి ఒక ఫాహియాన్ చంద్రగుప్త మౌర్య పాలనలో భారతదేశాన్ని సందర్శించిన తొలి చైనీస్ బౌద్ధ యాత్రికుడు.

భారతదేశంలో బౌద్ధ సంస్కృతి, గుప్త సామ్రాజ్యం గురించి తన పుస్తకం 'రికార్డు ఆఫ్ ది బౌద్ధ' రాజ్యాలు అనే గ్రంథంలో వివరించారు. ఆయన పర్యటనలో 'లుంబిని' సందర్శనకు ప్రత్యేకంగా ప్రసిద్ధి చెందారు. ఒక హ్యూయోన్‌త్సంగ్, ఏడవ శతాబ్దంలో హర్షవర్ధనుడి పాలనలో భారతదేశాన్ని సందర్శించారు. బౌద్ధ లిపిని సేకరించాలనే లక్ష్యంతో భారతదేశంలో దాదాపుగా 15 సంవత్సరాలు గడిపాడు. తన అనుభవాలను "ద రికార్డ్స్ ఆఫ్ ద వెస్టర్న్ వరల్డ్" అనే పుస్తకంలో నమోదు చేశారు. మరొక చైనా యాత్రికుడు 'ఇత్సింగ్' క్రీస్తు శకం 670లో భారతదేశాన్ని సందర్శించారు. నలంద విశ్వవిద్యాలయం గురించి ఆయన అద్భుతంగా వివరించారు. ఇది ప్రపంచ పర్యాటకులను భారతదేశ పర్యాటక స్థలాలుగా ఆకర్షించిన విషయంగా చెప్పుకోవచ్చు.

## తీర్థయాత్రలు

ఇక తీర్థయాత్రలకు విషయానికి వస్తే అనేక అద్భుతమైన ఆధ్యాత్మిక సాంస్కృతిక తీర్థయాత్ర స్థలాలు మన భారతదేశంలో ఎన్నో ఉన్నాయి. ఆసేతు హిమాచలం కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు అరుణాచల ప్రాంతం నుండి గుజరాత్ సోమనాథ్ దేవాలయం వరకు భారతదేశంలోని ఏ ప్రాంతంలో చూసినా అనేక దేవాలయాలు బౌద్ధ ఆరామాలు కనిపిస్తాయి. ప్రకృతి సోయగాలు మరెన్నో ఉన్నాయి. ఆధునిక తెలుగు నవలా చరిత్రలో ఏనుగుల వీరస్వామయ్య గారు రాసిన పుస్తకం 'నా కాశీయాత్ర చరిత్ర' కేవలం ఒక నవల మాత్రమే కాదు. తెలుగులో తొలి యాత్ర చరిత్ర పుస్తకం. వీరాస్వామి గారి కాశీ యాత్ర 1830 మే 18వ తేదీన ప్రారంభమై 1831 సెప్టెంబర్ మూడున ముగిసింది. మొత్తం 15 నెలల 15 రోజులు ఆయన చేసిన కాశీ యాత్ర అనుభవాలను ఈ పుస్తకంలో నమోదు చేశారు.

ఈ నవల 19వ శతాబ్దపు సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులకు ముఖ్యమైన ఆధారంగా ఇప్పటికీ పరిగణించబడుతుంది. ఈ నవల తెలుగు యాత్ర సాహిత్యంలో మొదటి పుస్తకంగా భావిస్తాం. చూసే మనసుకు కనులుంటే కవిత్వం తన్నుకు వస్తుంది. 'రవి గాంచని చోట కవి గాంచుననే' నానుడి ఇందులో నుండే పుట్టింది.



"సంచారం ఎంత సంతోషంగా ఉంటుందో" తెలంగాణ జానపద కవి, సామాజిక వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న రాసిన "సంచారమే బహు బాగున్నది" అన్న పాట వింటే తెలుస్తుంది. సంచారంలో ఎంత ఆనందం ఉందో సంతోషం ఉందో ఆ పాట తెలుపుతుంది...

మనిషి ఎంత సంఘజీవో అంత లోకాన్ని చుట్టి రావాలనే స్వేచ్ఛా జీవి. అందులో నుంచే ప్రపంచ పర్యాటకం పుట్టుకొచ్చింది. "చిన్ని నా బొజ్జకు శ్రీరామరక్ష" అనుకుంటూ నూతిలో కప్పలాగా అక్కడే ఉంటే మనిషి ఎదగడు. అదే పర్యాటక రంగం ద్వారా అనేక ప్రదేశాలు సందర్శిస్తే మన జీవితానుభవం సామాజికంగా మారుతుంది. దాంతో కొత్త విషయాలు కొత్త భాషలు, కొత్త మనుషుల పరిచయం ఎప్పటికప్పుడు మనిషి జీవితాన్ని మరింత పరిపుష్టం చేస్తుంది. అందుకే పర్యాటక రంగం అభివృద్ధి చెందాలంటే ఈ తాత్విక భావన అవసరం. "ఇల్లే వైకుంఠం వాకిలే కైలాసం" అనుకుంటే లాభం లేదు. మనకు తెలియని ప్రపంచం ఎంతో ఉంది. ప్రకృతి అద్భుతాలు



ఎన్నో ఉన్నాయి. వాటిని కళ్ళనిండా చూసి తనివితీరా అనుభవించి అనుభూతి చెందినప్పుడే కదా ఇదేరా జీవితం అనిపిస్తుంది.అందుకే ఇటీవల మరణించిన మరొక తెలంగాణ ప్రజా కవి (అందె ఎల్లన్న) 'అందెశ్రీ' అనే కలం పేరు మీద ఎన్నో పాటలు రాశారు. ఆయన ప్రపంచ పర్యాటకం పట్ల ముఖ్యంగా ప్రపంచంలోని



నదులు అన్నిటిని సందర్శించి దోసిలితో ఆ నీళ్లను తాగి అందులో స్నానం చేసే అనుభూతిని పొంది ఆ నదుల గొప్పతనం గురించి రాయాలని తపనపడ్డారు. అందులో తన కలను కొంతవరకు సాకారం చేసుకున్నారు. ఆయన తన కల పూర్తి కాకుండానే అర్ధాంతరంగా మరణించారు.


"ఎంతో చిన్నది జీవితం.. ఇంకా చిన్నది యవ్వనం" అంటూ అనుభవించు రాజా.. అనే ధోరణితో వెళ్లే వాళ్లకి పర్యాటకం ఒక అద్భుత అనుభవం. "కాళ్లు, రెక్కలు ఆడుతున్నప్పుడే యాత్రలు చేయాలనే" జీవిత సత్యాన్ని పెద్దలు బోధిస్తుంటారు. మనిషి కలల ప్రపంచానికి పర్యాటకం ఎంతో దోహదపడుతుంది.

ఇక మన భారతదేశంలో పర్యాటకం ఎలా ఉంది.. ఎలా అభివృద్ధి చెందాలి.. దానికి పాలకులు ఏం చేయాలి.. ప్రజలు ఎలా స్పందించాలి? అనే విషయాలు గురించి మాట్లాడుకుందాం..

## పసందైన విందు పర్యాటకం

పర్యాటక రంగం ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలకు కీలకమైన వనరు. మన భారతదేశం గొప్ప చరిత్ర, సంస్కృతి విభిన్న భౌగోళిక ప్రాంతాలతో అలరారే దివ్య భూమి. చాలా దేశాలకు కేవలం నలువైపులా భౌగోళికమైన ఎల్లలు మాత్రమే ఉంటాయి. ఉదాహరణకు మనకు తూర్పున బంగాళాఖాతం పడమటన అరేబియా మహాసముద్రం దక్షిణాన హిందూ మహాసముద్రం ఉత్తరాన హిమాలయాలు అని చెప్పుకుంటాం. కానీ దీనికంటే మిన్నగా మన భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలు, సాహిత్యం వీటన్నిటి కలయికల మేళవింపుగా మన భారతదేశాన్ని చూడాలి.

అందులో భాగంగా కన్యాకుమారి నుండి ఉత్తరానికి ప్రయాణం చేస్తుంటే మధుర మీనాక్షి, కంచి కామాక్షి, అరుణాచలం కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వరుడి దేవాలయం తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీశైలం, విజయవాడ కనకదుర్గ, భద్రాద్రి రామయ్య, యాదగిరి లక్ష్మీనరసింహస్వామి, కొమరవెల్లి మల్లికార్జున స్వామి, వేములవాడ రాజన్న, కలకత్తా కాళీమాత, బుద్ధగయ, నైమిశారణ్యం, అయోధ్య, వారణాసి, ప్రయాగ్‌రాజ్, చార్‌దామ్ యాత్రలు, శ్రీనగర్ దాల్ సరస్సు, హిమవన్నగాల అందాలు, ఆకాశాన్ని అంటే పర్వతాలు పక్కనే అందమైన లోయలు శ్రీనగర్ ఆదిశంకరాచార్య మందిరం, దివ్య అమరనాథ దేవాలయం, జమ్ములోని దేవాలయాలు; మరో వంక చినాబు నది మీద ఇటీవలే కట్టిన ప్రపంచంలోనే ఎత్తైన అద్భుతమైన వంతెన చూడడానికి మన కన్నులు సరిపోవు. అమృత్‌సర్ స్వర్ణ దేవాలయం, గుజరాత్‌లోని సోమనాథ దేవాలయం, కృష్ణుని ద్వారక, మహారాష్ట్రలోని శిరిడి..



ద్వారా కూడా ప్యాకేజీ టూరిజంను మరింత అభివృద్ధి పరిచారు.

రౌండ్ ది క్లాక్ అన్ని పర్యాటక ప్రదేశాలను కలుపుతూ రౌండప్ చేసే టూరిజంప్యాకేజీలు కూడా పెరిగాయి. ఆయా ప్రజల ఆర్థిక స్థితిగతులను బట్టి వాటికి అనుగుణంగానే బస్సు నుంచి మొదలుకొని విమానం దాకా అనేక సౌకర్యాలతో నేటి పర్యాటక రంగం అద్భుతంగా ముందుకు పోతుంది.

ద్వారకామాయి, పండరీపురం, కర్ణాటకలోని గోకర్ణం, మురుదేశ్వరం, కేరళ తిరువనంతరంపురంలోని అనంత పద్మనాభస్వామి దేవాలయం వరకు ఒకసారి విహంగ వీక్షణం చేస్తే మరెన్నో దేవాలయాలు, మఠాలు, చర్చిలు, మసీదులు అనేక చారిత్రిక సాంస్కృతిక ప్రదేశాలు మనకు కనివిందు చేస్తాయి.

ప్రపంచ వారసత్వ నిర్మాణాలుగా గుర్తింపు పొందిన రామప్ప లాంటి అనేక చారిత్రిక ప్రదేశాలు, దేవాలయాలు కూడా ఇందులోనే ఉన్నాయి.

పూర్వ కాలంలో యాత్రా స్థలాలను తిరగడానికి కేవలం నడక, లేకపోతే గుర్రాలు ఇతర వాహనాలు వాడేవారు. కానీ ప్రస్తుతం పర్యాటక రంగం అభివృద్ధి చెంది వేగంగా ప్రయాణించే రైలు, రోడ్డు మార్గం అలాగే విమాన మార్గాలు అందులో అందుబాటులోకి వచ్చాయి.

వేగవంతమైన యాంత్రిక జీవితంలో అంతకంటే వేగంగా ఈ ప్రదేశాలు అన్నీ చుట్టి రావాలంటే ఖర్చుతో పాటు సమయం కూడా కలిసి రావాలి. కానీ ఇటీవల దేశంలో పర్యాటక రంగంలో అద్భుతమైన పెను మార్పులు సంభవించడం వల్ల అనేక పర్యాటక రంగ ఏజెన్సీలు ముఖ్యంగా ప్రభుత్వ టూరిజం డిపార్ట్‌మెంట్లు అన్ని రాష్ట్రాలలో యాత్రికులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాయి. అందులో భాగంగా ట్రైన్ టూరిజం బాగా అభివృద్ధి చెందింది. అలాగే విమానయానం

ప్రజల భక్తి భావనలకు ఆహ్లాదకరమైన టూరిజానికి మాత్రమే ఈ పర్యాటక రంగాన్ని పరిమితం చేయొద్దు. పర్యాటక రంగం వల్ల ఆయా దేశాల ఆర్థిక స్థితిగతులు మారుతాయి. ఉదా: సింగపూర్ లాంటి దేశం తన తలసరి ఆదాయాన్ని పెంచుకోగలిగిందంటే టూరిజం అభివృద్ధి చేయడం వల్లనే జరిగింది.

ట్రావెల్ అండ్ టూరిజం డెవలప్‌మెంట్ ఇండెక్స్ (TTDI) 2024లో మన దేశం ప్రపంచంలో 39వ స్థానంలో నిలిచింది.

ఇంత అద్భుతమైన అవకాశాలు యాత్ర స్థలాలు ఉన్న మన దేశం ఇంత వెనుకబడి ఉండడానికి ప్రధానంగా ప్రభుత్వాల అలసత్వం అశ్రద్ధ కూడా ఒక కారణంగా చెప్పుకోవచ్చు. పర్యాటకం దేశ అభివృద్ధికి ముఖ్యమైన చోదకశక్తి, ఉపాధి కల్పన కూడా. నిరుద్యోగం తగ్గించడానికి, కొత్త ఉద్యోగాలు సృష్టించడానికి పర్యాటకం దోహదపడుతుంది. భారతదేశ పర్యాటక పరిశ్రమ రాబోయే దశాబ్దంలో 20 శాతం వృద్ధి చెందుతుందని అంచనా. ఎందుకంటే మన దేశంలో పేదరికం స్థాయి తగ్గి మధ్య ఆదాయ వర్గాలు మధ్య తరగతి ప్రజల సమూహాల పెరుగుదల కారణంగా పర్యాటక రంగంలో వృద్ధి కనపడుతుంది. అందుకే మన దేశంలో కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు ఏ దేవాలయం చూసినా ఏ పర్యాటక ప్రదేశం చూసినా మన తెలుగువారు పర్యాటకులుగా లేని ప్రదేశం కనిపించదు.

మన దేశానికి దేవాలయాలు, చర్చిలు, మసీదులు చారిత్రక ప్రదేశాలే కాకుండా సుమారు 4500 కిలోమీటర్ల వరకు సముద్ర తీరం ఉంది. దేశానికి పడమట దిక్కున అరేబియా మహాసముద్రం గుజరాత్ నుంచి మొదలుకొని కేరళ వరకు; దక్షిణాన హిందూ మహాసముద్రం తూర్పున తమిళనాడు మొదలుకొని



పశ్చిమ బెంగాల్ కలకత్తా వరకు బంగాళాఖాతం వరకు అనేక సముద్ర తీర బీచ్‌లు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి అలరిస్తున్నాయి.

ఇటీవల ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడటం వల్ల కేవలం..



దేశంలోనే కాకుండా మనవారు ప్రపంచ వ్యాప్తంగా పర్యటిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని రంగాల వృద్ధి వల్ల ఆయా రంగాలలో పనిచేసే ఉద్యోగులు/ కమిషన్ ఏజెంట్లు ఆయా దేశాలను సందర్శిస్తున్నారు.

ఉదా: ఫార్మాస్యూటికల్ రంగంలో ఉన్న మెడికల్ రిప్రజెంటేటివ్స్, డాక్టర్లు, ఇన్సూరెన్స్ రంగంలో ఉన్న ఏజెంట్లు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, వివిధ కార్పొరేట్ సంస్థల సిబ్బందిని వారి పనితీరును బట్టి విదేశాల పర్యటనకు ఎంపిక చేసి ఎప్పుడూ పని వత్తిడిలో ఉండే ఉద్యోగులకు విదేశీ పర్యాటకాన్ని అదనపు ఇన్సెంటివ్ బోనస్‌గా చూపిస్తూ ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. అంతేకాదు.. విమానయాన సంస్థల ప్రయాణపు ఖర్చులు కూడా తగ్గడం వల్ల దేశీ విమానయానం కంటే విదేశాలకు విదేశీ విమానాల టూరిజం ప్యాకేజీలు మరింత చౌకగా ఆసక్తికరంగా ఉంటున్నాయి. కొన్ని విమానయాన సంస్థలు ఆయా పర్యాటక ప్రదేశాలలో డెస్టినేషన్ మ్యారేజ్‌లను ప్రోత్సహిస్తున్నాయి. ఫలానా మీటింగుకు ఫలానా పెళ్లికి ఫలానా శుభకార్యానికి ఫలానా దేశానికి వెళ్తే ఆర్థికంగా వెసులుబాటు కల్పిస్తూ చాలా సౌకర్యాలను కల్పిస్తున్నారు. మన భారతదేశ టూరిజం రంగం ప్రపంచంలోని ఇతర దేశాల ప్రభుత్వాల నుండి పర్యాటక రంగం నుండి ఎన్నో విషయాలు నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## మన పర్యాటక రంగం

వ్యక్తి లేక వ్యవస్థగానీ తాము ఎక్కడున్నామో తెలిస్తే ఎక్కడికి వెళ్లాలో అంతకంటే బాగా తెలుస్తుంది. అందుకే మన బలాలు, బలహీనతలు, అవకాశాలు, అవరోధాలు/ భయాలు.. మొదలైన వాటిని అధిగమిస్తే పర్యాటకం మరింత పురోగమిస్తుంది. మన భారతదేశంలో పర్యాటకానికి ఉన్న బలాలను గమనిస్తే మిగతా దేశాల కంటే ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భౌగోళిక, చారిత్రక పర్యాటక స్థలాలు ఎక్కువ ఉన్నాయి. మిగతా దేశాల వాతావరణ పరిస్థితులతో పోల్చుకుంటే ఎండాకాలం, వానాకాలం, చలికాలాలతో నిమిత్తం లేకుండా మన దేశంలో అన్ని కాలాలలో దేశంలో ఎక్కడో ఒకచోట పర్యాటకం చేయొచ్చు. ఎండాకాలంలో ఉత్తర భారతదేశ యాత్ర, చలికాలంలో దక్షిణ భారతదేశ యాత్ర చేయొచ్చు. అన్ని మతాలను గౌరవించే లౌకిక రాజ్యంలో ఉన్నాం కనుక అన్ని మతాలకు సంబంధించిన దేవాలయాలు, ప్రార్థనా స్థలాలు మనకు అందుబాటులో ఉన్నాయి. పర్యాటకుల ఇష్టాన్ని బట్టి అన్ని మతాలకు చెందినవారు మన దేశంలో పర్యటించవచ్చు. మిగతా దేశాల కంటే మన దేశంలో పర్యాటకులకు భద్రత ఎక్కువ. ఇక రెండవది అయిన బలహీనతలను గమనిస్తే పర్యాటక రంగానికి ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహం తక్కువ. అలాగే మన యాత్రా స్థలాలలో మిగతా దేశాలతో పోల్చుకుంటే పారిశుద్ధ్య లోపం ఎక్కువగా కనబడుతుంది. నదులను పవిత్ర స్థలాలుగా చూసే మనం నదులను నీటి వనరులను ఆచారాలు సాంప్రదాయాల పేర్ల మీద మీద కలుషితంచేస్తున్నాం.

ఇక అవకాశాల పరంగా చూస్తే వేద భూమిగా పేరు పొందిన మన భారతదేశానికి చాలామంది విదేశీ యాత్రికులు రావడానికి సిద్ధంగా ఉన్నారు. ఎటూ వచ్చి వండిన అన్నాన్ని వడ్డించడమే సమస్య. అలాగే వేరే దేశాల నుండి కానీ మన దేశంలో ఉన్న పర్యాటకుల నుండి కానీ వారు ఆశించిన రీతిలో అవకాశాలను కల్పిస్తే తప్పక మన పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. మన ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదేశాలలో చాలామంది విదేశీ వ్యక్తులు వచ్చి నెలలు తరబడి ఉండిపోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఇది ఒక అవకాశంగా మనం భావించాలి. దానికి తగిన ఏర్పాట్లు చేయాలి.

ఇక చివరగా.. ఏ రంగంలోనైనా భయాలు ఉంటూనే ఉంటాయి. అవరోధాలు కలుగుతుంటాయి. కానీ అవరోధాలను, మనకున్న బలాలను పెంచుకొని బలహీనతను తగ్గించుకొని అవకాశాలుగా మార్చుకొని ముందుకు సాగడమే మన పర్యాటక రంగానికి అవసరమైన చర్య. అంగట్లో అన్ని ఉన్నాయి అల్లుని నోట్లో శని.. అన్నట్లు మన పర్యాటక రంగానికి భారత ప్రభుత్వం ఇవ్వాల్సినంత ప్రోత్సాహం ఇస్తే మన పర్యాటక రంగం విదేశాలను అధిగమించి ప్రస్తుతం ఉన్న ముప్పై తొమ్మిదవ స్థానం నుంచి తొమ్మిదవ స్థానానికి చేరడానికి అనేక అవకాశాలు ఉన్నాయి.



# పప్పీలకు రెయిన్ కోట్

సాధారణంగా మనుషులు గొడుగులు వాడుతారు. వర్షం నుండి రక్షణకోసం రెయిన్‌కోట్‌లు ఉపయోగిస్తారు. పప్పీలకు రెయిన్‌కోట్‌లు ఉంటాయయంటే ఆశ్చర్యంగా ఉంది కదా! నిజమే మరి పప్పీలకు మాత్రమే కాదు డాగ్‌లకు కూడా రెయిన్‌కోట్‌లు వచ్చాయి. అవే డాగ్ రెయిన్‌కోట్. ఇవి పెట్స్ మొహం నుంచి కాళ్ల వరకు మొత్తం శరీరాన్నంతా కప్పి ఉంచుతుంది. కాలి చివర ఉండే ఎలాస్టిక్ టామీ పరుగెత్తేటప్పుడు జారకుండా ఉంటుంది. బటన్లు, వెల్‌క్రో సాయంతో దీనిని సులువుగా తొడగొచ్చు. వివిధ బ్రీడ్‌లకు సరిపోయేలా అన్ని రకాల సైజుల్లో దొరుకుతాయి.



# చెట్టుకూ చిరునామా!

బంధువులు, స్నేహితులకు ఉత్తరాలు రాయడం తెలిసిందే. ఒకప్పుడు ఆ ఉత్తరాలు బోలెడు సమాచారాన్ని అందించేవి. అయితే చెట్టుకు ఉత్తరాలు రాయడం తెలుసా? భలే వింతగా ఉంది కదూ!

ఈ వింత జర్మనీలోని యుటిన్‌లో కనిపిస్తుంది. అక్కడున్న ఓక్ చెట్టుకు రోజూ నాలుగైదు ఉత్తరాలు వస్తుంటాయి. తమ ప్రేమ ఫలించాలని ఆ చెట్టుకు ఉత్తరాలు రాస్తారు. అందుకే ఆ చెట్టును 'బ్రైడ్‌గ్రూమ్ ఓక్' అంటారు. జర్మనీలో యుటిన్ నగరానికి సమీపంలో ఉన్న డోడౌర్ అనే అడవిలో ఉందీ ఓక్ చెట్టు. ఈ చెట్టుకు ఉత్తరం రాస్తే కోరుకున్నది తీరుతుందని అక్కడి నమ్ముతారు. కోరికలు తీరిన వారు ఇది నిజమేనంటారు. ఎక్కువ మంది భాగస్వామి దొరకాలని ఉత్తరాలు రాస్తుంటారు.

ఉత్తరాల సంఖ్య పెరగడంతో అధికారులు ఈ చెట్టుకు పోస్టల్ కోడ్‌తో చిరునామా కేటాయించారు. ఆ చిరునామాతో ప్రపంచం నలుమూలల నుంచి వేల ఉత్తరాలు ఇప్పటికీ వస్తున్నాయి. ఈ చెట్టుకు ఐదు వందల యేళ్ల చరిత్ర ఉంది. అయితే ఈ ప్రేమలేఖలు రాసే సంప్రదాయం వెనుక ఒక కథ ఉంది. సుమారు వందేళ్ల క్రితం ఓర్ట్ అనే అమ్మాయి షుట్టే ఫెల్చే అనే అబ్బాయితో ప్రేమలో పడింది. వారి ప్రేమను అమ్మాయి తండ్రి ఒప్పుకోలేదు. ఇద్దరినీ కట్టడి చేశారు. దాంతో వారు అక్కడున్న ఒక చెట్టు కాండానికి ఉన్న తొర్రలో ఉత్తరాలు వేస్తూ రహస్యంగా సంభాషించుకునేవారు.



చివరకు ఓర్ట్ తండ్రి ఒప్పుకోవడంతో 1891లో అదే చెట్టుకింద ఆ ప్రేమికులకు వివాహం చేశారు. ఇది జరిగిన తరువాత ప్రేమలో ఉత్తరం రాసి తొర్రలో వేయడం ప్రారంభించారు. అలా చేయడం వల్ల వారి ప్రేమ సక్సెస్ అయిందని చాలా మంది చెబుతారు. ఆ విధంగా ఆ చెట్టు బాగా పాపులర్ కావడంతో 1927లో జర్మనీ పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఆ చెట్టుకు ఒక పోస్టల్ కోడ్ కేటాయించారు. ఆ తరువాత ఆ చెట్టుకు ప్రపంచం నలుమూలల నుంచి ఉత్తరాలు రావడం ప్రారంభమైంది. ప్రేమికుల చెట్టుగా ప్రసిద్ధి చెందిన ఈ చెట్టు కాండానికి ఉండే లోతైన తొర్ర పది అడుగుల ఎత్తులో ఉంటుంది. అందుకే ఒక నిచ్చెనను చెట్టుకు అమర్చారు. ఉత్తరాలను నిచ్చెన ఎక్కి అందులో వేస్తారు. ఇప్పటిదాకా ఈ చెట్టు ద్వారా కొన్ని వందల వివాహాలు జరిగినట్లు చెబుతారు. ఈ బ్రైడ్‌గ్రూమ్ ఓక్ ట్రీకి రోజుకు అయిదారు ఉత్తరాలు వస్తుంటాయి. దీనికి మరో చెట్టుతో వివాహం కూడా చేశారు. దానికి సొంత పోస్టల్ అడ్రస్ ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఇళ్లకు, కార్యాలయాలకు పోస్టల్ చిరునామాలు ఉంటే ఒక ఓక్ చెట్టుకు దానిని కేటాయించడం విశేషమే కదా!

చిన్న కథ

# భార్యామణులు

సుబ్బారావు తన భార్య లాయర్ రత్నమాలతో కలిసి దసరా పండగకి బట్టలు కొనడానికి షాపింగ్‌కి వెళ్లాడు.

షాపింగ్ చేసి బయటకు రాగానే బయట ఒక బండి మీద బంతిపూల దండలు అమ్మడం చూసి రత్నమాల భర్తతో “ఇంటి గుమ్మానికి కట్టడానికి ఒక దండ కొందామని” చెప్పింది.

సుబ్బారావు గుమ్మానికి కట్టడానికి “ఎంత పొడవు దండ కావాలో” మనసులోనే లెక్క వేసుకుని–

“ఒక ఆరు మూరల దండ తీసుకోమని” భార్యకి చెప్పాడు.

ఇద్దరు కలిసి ఆ బండి దగ్గరకు వెళ్లారు.

రత్నమాల “మూర ఎట్లా ఇస్తున్నావని?” దండలు అమ్ముతున్న అమ్మాయిని అడిగింది.

ఆ అమ్మాయి “మూర నలభై రూపాయలంది”.

“ఎంతకు బేరం చెయ్యాలన్నట్టు?” భర్త వేపు చూసింది రత్నమాల.

“ముప్పైకి అడుగు” రత్నమాలకే వినపడేటట్లు మెల్లగా అన్నాడు సుబ్బారావు.

వెంటనే రత్నమాల “ముప్పైకి ఇచ్చేయి ఆరు మూరలు తీసుకుంటాను” అంది.

పూలమ్మాయి “పదదమ్మాయిగారు, ముప్పై ఐదుకిస్తాను” అంది.

“ఎప్పుడూ తీసుకునేవాళ్లమే. ముప్పై చేసుకో” అంది రత్నమాల.

“ఏం చెప్పాలా?” అని పక్కనున్న భర్త వేపు చూసింది పూలమ్మాయి.

“ఇచ్చేయి ఏం చేస్తాం బోణీబేరం” అన్నాడు భర్త”.

పూలమ్మాయి ఆరు మూరలు కొలిచి పూలదండను ఒక కవర్‌లో



పెట్టి రత్నమాలకిచ్చింది.

సుబ్బారావు ఒక రెండు వందల రూపాయల నోటును రత్నమాలకి ఇచ్చాడు పూలమ్మాయికి ఇవ్వమని.

“ఎంతివ్వాలి?” భర్తని అడిగింది రత్నమాల.

“నూట ఎనభై” అన్నాడు సుబ్బారావు.

నోటు తీసుకున్న పూలమ్మాయి భర్తని అడిగింది “ఎంత తీసుకోవాలి?” అని.

“ఆరు మూళ్ల పద్దెనిమిది, నూట ఎనభై తీసుకో, ఇరవై ఇచ్చేయి అన్నాడు” ఆమె భర్త.

“గులాబీపూలు చాలా తాజాగా ఉన్నాయి. మిగతా ఇరవై రూపాయలకి తీసుకో అమ్మా! రేపు పూజకి పనికి వస్తాయి” అంది పూలమ్మాయి.

“తాజావేనా? కొంచెం ఎక్కువ వేసి ఇయ్యి” అని ఆ గులాబీ పొట్లం కూడా తీసుకుని పూలదండ బేరం ముగించింది రత్నమాల.

ఇంటికొచ్చాక భార్యని అడిగాడు సుబ్బారావు “ఆరు ముప్పైలు ఎంతో కూడా తెలియదా?” అని.

దానికి రత్నమాల “మీరుండగా లెక్కవేసే శ్రమ నాకెందుకు? తప్పొప్పులు ఏవైనా ఉంటే మీరే బాధ్యులవుతారు” అని కొంటెగా నవ్వింది.

ఆమె నెరజాణతనానికి నోరెళ్లబెట్టాడు సుబ్బారావు.

– తాళ్లూరి లక్ష్మి

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

ఈ వారం కవిత్వం

# అదే సాయంత్రం



అదే సాయంత్రం.. ఊరిబైట
దినకరుడు చెరువులో దిగితే
క్షణంలో బంగారుకాంతి వెలుగులో
సాయంత్రం బాగుందని
ఫ్యాక్టరీ నుండి
చెమటగంధం
పూసుకొని
విడుదలైన కొందరు
కొందరు..

దారి మీద
ఇరువైపుల దీపాలు వెలిగితే
నిమిషంలో నియానకాంతి జిలుగులో
సాయంత్రం బాగుందని
కొందరు..
వీక్షణలో ఆశారేఖలు లేక లోపల
మాట సాయం.. చేతిసాయం..
చేబదులు సాయం

దొరక్క నిరాశలో నిలబడ్డ
అదే.. సాయంత్రాన్ని
ఆస్వాదించలేదు
వాళ్లకి
తెరల సాయంత్రం
చెరల సాయంత్రం
సమిష్టి శ్రేయస్సు కోరని
దొరల సాయంత్రం

– కోటం చంద్రశేఖర్

# నా ప్రతిబింబం ఆగిపోయింది

వాకిట్లో నిలుచున్న నేను..
నా కళ్ళు వీధి వైపు..

ఆయన వస్తాడని నా కోసం ఎవేవో



తెస్తాడని..
కొన్ని కబుర్లు, కొన్ని
ఆశలు, వెచ్చని శ్వాసలు
తన కళ్ళల్లో కాంతిని
తీసుకొస్తాడని
ఆ కాంతి నాకు
పంచుతాడని..
గుండెల నిండా ప్రేమతో
వస్తాడని
నా భవిషత్తు లో
వెలుగు నింపడానికి
తన కష్టం అంతా నా
కోసమేనని
తన ఇష్టం అంతా నా కోసమేనని
ఆయన మనసు అంతా నా కోసం
ఎదురు చూస్తూ ఉంటుందని
నేను కట్టుకొన్న చీరె గురించి
నేను అలంకరించుకొన్న తీరు గురించి
ఆయన ఎంతో మెచ్చుకుంటారని..
వీధి చివర నుండి ఆయన మత్తులో
తూలుతూ నడుస్తూ
వచ్చి వాకిట్లో పడిపోయాడు.
నా ప్రతిబింబం ఆగిపోయింది.

– చల్లా రమేష్ కుమార్

# తరాల మధ్య వారధి

ఒక వీధిలో, ఓ మూలన
వెలిసిన ఆశలా నిశ్శబ్దంగా ఉంది.
ఇప్పుడు దాని చెంతకు
ఎవరూ వెళ్ళడం లేదు
చూపులు మాత్రం దాటి వెళ్తున్నాయి
ఎన్నో కలలు.. కన్నీళ్లు.. ప్రేమలు..
ఇప్పటికీ దాని గర్భంలో
నిద్రపోతున్నాయి!
ఉత్తరాల ద్వారా ప్రేమలేఖల నుంచి
ఆశీర్వచనాల దాకా.. అక్షరాల్లో అల్లిన అనుభూతులు
పెదవుల తడితో పంపిన జ్ఞాపకాలు
అన్నీ అక్కడే చేరుకొని మౌనంగా మమేకమై
కలసి ప్రయాణించేవి!! ప్రతిరోజూ నిండిన
ఉత్తరాలు తీసే వాహనం కోసం ఎదురు చూసేది.





ఇప్పుడు..
కనీసం
ఒక్కరైనా
వచ్చి
ఉత్తరం వేస్తారేమోనని ఆశగా ఎదురు చూస్తోంది
ఉత్తరానికి, ప్రత్యుత్తరానికి మధ్య
వారధిగా నిలిచిన ఆ ఎర్ర తపాలా పెట్టె
కొన్ని చోట్ల దాని జాడే లేదు!
ఇప్పుడు మన మాటలు చరవాణీల్లో వేగంగా వెళ్తున్నా
ఆ మాటల్లో స్పర్శ లేదు.
కానీ ఆ ఎర్ర తపాలా పెట్టెలు మాత్రం
నిశ్శబ్దంగా... ముదుసలితనంతో ఇంకా అక్కడే గర్వంగా
మౌనంగా ఎదురు చూస్తూనే ఉన్నాయి!

– చిత్రాడ కిషోర్ కుమార్













ఇప్పుడు వాల్ డెకరేషన్ సరికొత్త పుంతలు తొక్కుతోంది. ప్రకృతి ప్రేమికులకు ఈ తరహా స్టిక్కరింగ్ సేద తీరుస్తున్నట్లే. ఎందుకంటే కంటికి కనబడకుండా పోయిన హరితవనాలు, పక్షులూ, జంతువుల స్టిక్కర్లు ఇప్పుడు మన ఇంటిగోడలపై కొలువై కంటికీ ఇంపుగా కనిపిస్తున్నాయి. అద్భుతమైన భగవంతుని రూపాలు, తోటలోంచి ఇంట్లోకి చొచ్చుకువచ్చినట్లుండే తరుశాఖలూ.. వాటి మీద పక్షులూ.. ఇలా సరికొత్త వాతావరణం ఇప్పుడు వరండాలో డ్రాయింగ్ హాల్లో పడగ్గదిలో స్టిక్కర్ రూపంలో తళుకులీనుతున్నాయి.

ఆనంద'మైత్రేయ'మ్







# ఒక్క అడుగు

ప్రకృతిలో ప్రతి జీవికి ఓ పాత్ర ఉంది. ఆ పాత్రను సద్వినియోగం చేసుకుంటే సమతుల్య జీవ వ్యవస్థ ఏర్పడుతుంది. కానీ మానవుడి అవసరాలు ఆ హద్దులను దాటుతున్నాయి. అడవులను ఆక్రమించడం, ప్రకృతి సంపదను దోచుకోవడం, వన్యప్రాణులను వేటాడడం ద్వారా జీవజాలాన్ని దెబ్బతీస్తున్నాడు. మారిన బతుకు మాధుర్యంలో మనకు కనిపించకపోయిన గొప్ప జీవం ఏనుగు. ఏనుగు సంస్కృతికి, సంప్రదాయానికి, ప్రకృతికి, పరిరక్షణకు ప్రతీక. ఒక ఏనుగు గుండె మనిషి కన్నా గట్టిదే కాదు, మెత్తదై ఉంటుంది. ఏనుగులు జ్ఞాపకశక్తిలో అత్యున్నత స్థాయిలో ఉంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 30 యేళ్ల కిందట జరిగిన సంఘటనలను గుర్తుంచే సామర్థ్యం వాటికి ఉంటుంది. ఇవి శోకాన్ని వ్యక్తపరుస్తాయి. ఇలాంటి విశిష్టమైన లక్షణాలు కలిగిన జీవుల సంరక్షణ మన బాధ్యత కాదా?

## దంతాల వెనుక దారుణ నిజం

ఏనుగుల దంతాలు తెల్లగా మెరిసే అందాలుగా కాకుండా, నల్లని మానవ క్రూరత్వానికి దర్పణంగా మారాయి. ప్రతి యేటా వేల ఏనుగులు కేవలం దంతాల కోసం మృత్యువు పాలవుతున్నాయి. వేటగాళ్లు ఒక ఏనుగును చంపితే, దాని కుటుంబం మృతదేహం చుట్టూ గంటల తరబడి తిరుగుతూ, శోకాన్ని వ్యక్తపరుస్తుంది. ఇది చూసిన ఎవరికైనా అది ఒక 'జంతువు' కాదు అని స్పష్టంగా అర్థమవుతుంది. అడవులు తగ్గిపోతుండటంతో ఏనుగుల నివాసాలు మాయమవుతున్నాయి. అడవిలోకి రోడ్లు, ఫ్యాక్టరీలు, మానవ వాసాలు చొచ్చుకురావడంతో ఏనుగులు తవ్వుకొంటూ ముందుకు సాగాల్సిన పరిస్థితి వస్తోంది.

రైతుల పంటలను నాశనం చేస్తూ సంచరించే ఏనుగులను మానవులు హింసించడం, కొట్టడం, తరచూ జరుగుతోంది. సమస్యేమిటంటే అవి తప్పించుకోలేని స్థితిలో ఉన్నాయి అనే విషయం మనం కనీసం ఆలోచించం.



## పరిరక్షణే పరిరక్షణకు మొదటి అడుగు

ఏనుగుల సంరక్షణ ప్రభుత్వాల ఒక బాధ్యతే అయినా, నిజంగా అది మానవతా విలువల కాపాడటానికి అవసరమైపోయింది. చిన్నారులకు విద్యా పాఠ్యాంశాల్లో వన్యప్రాణుల మాధుర్యం, అవసరాన్ని చేర్చాలి. ప్రకృతి ప్రేమను చిన్నతనంలోనే నేర్పాలి. పర్యావరణం అంటే కేవలం పచ్చదనం కాదు. వన్యప్రాణులు లేకుండా పచ్చదనం తన చలనాన్ని కోల్పోతుంది.

సంస్కృతిలో గజరాజానికి ఎంతో గౌరవం ఉంది. భారతదేశంలో ఏనుగును గణేశుడిగా పూజిస్తాం. అలాగే బౌద్ధ మతంలో బుద్ధుని గత జన్మల్లో ఏనుగుగా పుట్టిన కథలు ఉన్నాయి. జైన మతంలోనూ ఏనుగులకు పవిత్ర స్థానం ఉంది. అంటే మన మత పరమైన బంధం కూడా ఈ జీవంతో ఎంతో ఆత్మీయంగా ముడిపడి ఉంది.

**అడవుల పరిరక్షణ:** ఏనుగుల నివాసాలు కాపాడాలి. ఫారెస్ట్ కారిడార్లు రూపొందించాలి.

**శిక్షణ మార్గాల్లో సంస్కారం:** హింసాత్మక శిక్షణను నిషేధించాలి. పెంపుడు ఏనుగులకు జంతుప్రియ పద్ధతులు అమలుచేయాలి.

**పర్యాటక నియంత్రణ:** ఎలిఫెంట్ రైడ్స్ వంటి వినోదాలపై నిబంధనలు ఉండాలి.

**విరాళాలు, సహకారం:** సంరక్షణ కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు, సాంకేతిక సహాయం అందించాలి.

**పిల్లలకు అవగాహన:** విద్యాసంస్థల్లో నైతికత పాఠ్యాంశంలో వన్యప్రాణుల విలువ చేర్చాలి.

**చట్టస్వరూపం:** దంతాల వ్యాపారంపై కఠిన చట్టాలు అమలు చేయాలి. దుష్టులకు కఠిన శిక్షలు విధించాలి.

## వీధుల్లో, పూజల్లో మానవత్వం

మత పరమైన పండుగల్లో ఏనుగులను చూపుల కోసం కాదు, దయతో చూడాలి. ప్రతి రోజూ ప్రకృతిని ప్రేమించేదే. ఇది మనిషి బాధ్యతను గుర్తు చేసే రోజు. మనం చేసే ఒక్క పథకం, ఒక్క అవగాహన ప్రచారం, ఒక్క మొక్క నాటే కృషి..

ఇవన్నీ ఏనుగుల జీవనానికి ఒక చిన్న వెలుగు. ప్రేమతో పాటు చైతన్యం కూడా అవసరం. సంరక్షణకు మనం చూపే చొరవే ఈ జీవుల గతి మారుస్తుంది. మనం అడిగే ప్రశ్నలు, మౌనంగా చూసే దృక్పథం కాకుండా చర్యలు తీసుకునే దృక్పథం కావాలి.

– డాక్టర్ చిటికెన కిరణ్‌కుమార్

ఆధునిక శాస్త్ర సాంకేతిక విప్లవం ద్వారా ప్రపంచమే కుగ్రామం అయ్యింది. దేశ సరిహద్దులు కాగితాల వరకే పరిమితమయ్యాయి. అడిగిందే తడవుగా సమాచారం గుట్టలు గుట్టలుగా గూగులమ్మ వడ్డించి పెడుతున్నది. ప్రజలు, ముఖ్యంగా యువత చేతిలోని స్మార్ట్‌ఫోన్ శరీరంలో ఒక అంగమై తిష్ట వేసింది. అడిగిన సమాచారమే కాకుండా అక్కరలేని సమాచారాన్ని అడగక ముందే కళ్ల ముందు ఉంచుతున్నది. స్మార్ట్‌ఫోన్‌ను సద్వినియోగం చేసుకున్నవారు అభివృద్ధి చెందుతున్నారు. స్మార్ట్‌ఫోన్ దురలవాటు వలయంలో చిక్కినవారు అధోగతిపాలు అవుతున్నారు.

సోషల్ మీడియా యాప్‌లు మనకు తెలియకుండానే, మనల్ని వశపరుచుకుంటున్నాయి. స్మార్ట్ ఫోన్‌లో దూరిన వాట్స్ యాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, మెసెంజర్, లింక్‌డిన్ లాంటి అనేక సామాజిక మహిళలు వాడుతున్నట్లు తేలింది. ఇంటర్నెట్ వినియోగదారుల్లో 94 శాతం సామాజిక మాధ్యమాల్లోనే చక్కర్లు కొడుతున్నారు. జెన్ జెడ్ యువత సగటున 3 నుంచి 4 గంటలు సామాజిక మాధ్యమాల్లో మునిగి పోతున్నారు. సామాజిక మాధ్యమ వినియోగదారులు దురలవాటు వలయంలో చిక్కుతున్నారు. గంటల తరబడి సామాజిక మాధ్యమాల్లో సంసారం చేస్తున్న వినియోగదారులు పలు అనారోగ్యాల బారిన పడుతున్నారు.

### లాభ నష్టాలు

సామాజిక మాధ్యమాలను సక్రమంగా, తెలివిగా వాడుకోవడం వల్ల వ్యక్తిగత ఉన్నతి జరుగుతుంది. కుటుంబ సభ్యులతో కలిసిపోవడం, సమాజంతో సత్సంబంధాలు పెరగడం, అవసర సమాచారాన్ని సత్వరమే పొందడం,

# సామాజిక మాధ్యమాలను సద్వినియోగం చేసుకుందాం!



మాధ్యమాలు కుప్పలు తెప్పలుగా సమాచారాలను మన చెంతకు చేరవేస్తున్నాయి. వీటిలో అక్కరకురాని సమాచారమే అధికంగా ఉంటున్నది. సామాజిక మాధ్యమాలను మనం నియంత్రించడానికి బదులు అవే మనల్ని బానిసలుగా మార్చి మానసిక వేదనకు గురి చేస్తున్నాయి. సామాజిక మాధ్యమ చెరసాల్లో గంటలకొద్ది ఒంటరిగా బతుకులు ఈడుస్తున్నాం. అసామాజిక మాధ్యమాల దండయాత్ర ఇలాగే కొనసాగితే రాబోయే కాలంలో నాగరికత పునర్నిర్వచించబడుతుంది. మనిషి ఒంటరి పక్షి అవుతాడు. కుటుంబాలు విచ్ఛిన్నం అవుతాయి. డిజిటల్ యువతరం నిర్వీర్యం అవుతుంది. సంఘజీవి అసాంఘిక శక్తిగా ఎదుగుతాడు. మానసిక రోగాలు చుట్టుముడతాయి.

### ప్రపంచ జనాభాలో 68.7 శాతం సామాజిక మాధ్యమ వినియోగదారులు

నేడు ప్రపంచవ్యాప్తంగా 5.66 బిలియన్లకు (జనాభాలో 68.7 శాతం) పైగా సామాజిక మాధ్యమ వినియోగదారులు ఉన్నారు. విశ్వవ్యాప్తంగా సామాజిక మాధ్యమాల్లో సగటున రోజుకు 2 గంటల 25 నిమిషాల పాటు మునిగి తేలుతున్నారు. ఒక వ్యక్తి తన సగటు జీవిత కాలంలో 7 యేండ్లు పాటు సామాజిక మాధ్యమాల్లోనే గడుపుతున్నారు. ప్రపంచ స్థాయిలో 49 శాతం సామాజిక మాధ్యమ వినియోగదారుల్లో 55 శాతం పురుషులు, 45 శాతం

బ్యాంకింగ్ కార్యకలాపాలను ఇంట్లోంచి జరపడం, ఉద్యోగ సాధన నైపుణ్యాలను పెంపొందించుకోవడం, ప్రపంచ పోకడలను ఆకళింపు చేసుకోవడం, వర్క్ ఫ్రమ్ హోం, వ్యాపార అవకాశాలు కలగడం, ప్రపంచంతో అనుసంధానం కావడం లాంటి అనేక ప్రయోజనాలు సామాజిక మాధ్యమాల ద్వారా కలుగుతాయి. సామాజిక మాధ్యమాల్లోనే అతిగా సంసారం చేసే వ్యక్తుల్లో మానసిక ఒత్తిడి, ఆందోళన, ఏకాగ్రత కోల్పోవడం, దుర్వసనాలపాలు కావడం, ఫియర్ ఆఫ్ మిస్సింగ్, అనవసర అసంతృప్తి, సైబర్ బుల్లీయింగ్, నిద్రలేమి, కాలాన్ని వృథా చేయడం, అశ్లీల సైట్స్‌కు అలవాటు పడడం, నేర ప్రవృత్తి పెరగడం, భావోద్వేగ అనారోగ్యం, వ్యక్తిగత సమాచారం బయట పడడం, కుటుంబ సభ్యుల నుంచి దూరం కావడం, విచిత్ర విపరీత ప్రవర్తన, మానసిక అసమతుల్యత, పనిలో అశ్రద్ధ లాంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయి. సామాజిక మాధ్యమాలు మన జీవితాలను విచ్ఛిన్నం చేయకముందే జాగ్రత్త పడదాం, సామాజిక మాధ్యమ చెరసాల్లో పడకుండా దూరంగా ఉందాం. దీపం ఉండగానే ఇళ్లు చక్కబెట్టుకుందాం. భవిష్యత్తు భస్మం కాక ముందే జాగ్రత్తల నీళ్లు చల్లుదాం. యువత, పిల్లల శ్రేయస్సు కోరి స్మార్ట్‌ఫోన్ సాధనానికి దూరంగా ఉంచుదాం. సామాజిక మాధ్యమాలను అసాంఘిక కార్యకలాపాలకు వాడకుండా చూద్దాం.

– డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

కథ

# జింక ప్రాణం కాపాడిన మిత్రులు



ఒక అడవిలో జింక, కుందేలు, ఉడుత, రామచిలుక స్నేహితులుగా ఉండేవి. ఆహారం కోసం అవి నాలుగు నాలుగు దిక్కులకు వెళ్ళేవి. ఒకరు వెళ్లే దిక్కుకు వేరొకటి వెళ్ళేది కాదు. ఒకరోజు రామచిలుకకు ఒక ఆలోచనతో "మిత్రులారా, మనం రోజూ ఒక్క దిక్కుకు మాత్రమే వెళ్తున్నాం. రోజూ ఒకే రకమైన ఆహారం తింటున్నాం. రేపు మనం రోజూ వెళ్ళే దిక్కు కాకుండా వేరే దిక్కుకు వెళ్తే కొత్త ఆహారం తినొచ్చు" అని చెప్పింది. దానికి మిగతావి "సరే" అని మరుసటి రోజు అనుకున్న ప్రకారం అవి వెళ్లాలనుకున్న దిక్కులకు వెళ్లాయి. ఆ రోజు వాటికి రోజూ తినే ఆహారంతో పాటు ఎప్పుడూ తినని పండ్లు కూడా కనిపించాయి. వాటిని రుచి చూసి "నా మిత్రుడు రోజూ ఈ దిక్కుకు రావడం వల్ల ఇంత రుచికరమైన పండ్లు తింటున్నాడా?" అని అనుకుని సాయంత్రం వేళ అన్ని ఒక చెట్టు కిందకి చేరాయి. అప్పుడు ఉడుత, రామచిలుక, జింక అవి తిన్న పండ్లు గురించి చెప్పాయి. కుందేలు ఏమీ చెప్పకుండా అలా మౌనంగా ఉండటం చూసి మిగతా మిత్రులు కారణం అడిగాయి. దానికి కుందేలు "నేను ఆహారం కోసం ఒక చెట్టు దగ్గరకు వెళ్లగా, అక్కడ ఒక నక్క నాపై దాడి చేయబోయింది. నేను నా ప్రాణాలు కాపాడుకొని ఇలా పారిపోయి వచ్చాను" అని చెప్పింది. అప్పుడు మిగతా మిత్రులు జాలిపడి, కుందేలుకు ధైర్యం చెప్పాయి. రామచిలుక వెంటనే ఎగిరివెళ్లి ఒక పండు తెచ్చి కుందేలుకు ఇచ్చింది. కుందేలు ఆ పండు తిని చాలా సంతోషించింది. "రేపు మనందరం ఒకే దిక్కుకు వెళ్లి ఆహారం వెతుకుదాం. ఈ రోజు ఈ పరిస్థితి వల్ల నాకు భయంగా ఉంది" అని చెప్పింది. "సరే.." అని మరుసటి రోజు అన్నీ కలసి ఒకే దిక్కుకు వెళ్లాయి. దొరికిన పళ్ళు, ఆకులు తింటూ కేరింతలు పెడుతూ వెళ్లాయి.

రామచిలుక అందరికన్నా ముందు పైకి ఎగురుతూ వెళ్ళింది. దానికి ఒక వేటగాడు నక్కి ఉండడం కనిపించింది. వెంటనే వెనక్కి వెళ్లి మిత్రులకు ఈ విషయాన్ని చెప్పి అటు వైపు వెళ్ళొద్దని చెప్పింది. అవి సరే అని వెనక్కి తిరిగి వెళుతుండగా, అది గమనించిన వేటగాడు వాటి వెనుక బాణంతో పరుగుతీసాడు. అప్పుడు అవి ఒక్కో వైపు పరుగుతీసాయి. రామచిలుక, ఉడుత చెట్టు పైకి వెళ్లాయి. కుందేలు చెట్టు తొర్రలోకి వెళ్ళింది. జింక మాత్రం ఎటు వెళ్లాలో అర్థంకాక అలా నిలబడింది. వేటగాడు జింక వైపు వచ్చి బాణం వేయబోయాడు. అది గమనించిన ఉడుత అక్కడ ఉన్న చిన్న కొబ్బరిచెట్టు పైకి ఒక్క ఉదుటున ఎక్కి, ఒక కొబ్బరికాయని తీసి వేటగాడి తలపై వేసింది.

అంతే! వేటగాడి బాణంతో పాటు కళ్ళు తిరిగి కింద పడిపోయాడు. వెంటనే జింక అక్కడి నుండి పారిపోయింది. దాని వెనకాలే ఉడుత, రామచిలుక, కుందేలు వారు ఉండే చెట్టు దగ్గరకి వెళ్లిపోయాయి. కాసేపటికి వేటగాడు పైకి లేచి చుట్టూ చూసి ఏం జరిగిందో అర్థం కాక, జింక తప్పించుకుందని నిరాశతో వెనుదిరిగాడు. జింక కుందేలు చేసిన సహాయానికి కృతజ్ఞతతో తలతో కుందేలుకు నిమిరింది. "కష్ట సమయాలలో నీలాంటి మిత్రులు ఉన్నట్లయితే నిస్వార్థంగా ఆదుకుంటారు. కష్టం వచ్చినప్పుడు వదిలేసి వెళ్లిపోతే అది స్నేహం కాదు. ఈరోజు మనమంతా కలసి మెలసి ఉండటంవల్ల నా ప్రాణాలు నిలబడ్డాయి. మనం ఎప్పుడూ కలిసి మెలిసి ఉండాలి" అంటూ ఆ నలుగురు మిత్రులు ఆలింగనం చేసుకున్నాయి.

– పుల్లట సంతోష్




# బాలగేయం

## బాలలం

బాలలం బాలలం
చిట్టి పొట్టి బాలలం
బాలలం బాలలం
చిన్నారి బాలలం

బాలలం బాలలం
బడికి పోవు
బాలలం
చదువు సంధ్యలందు
శ్రద్ధ కలిగి
చదువు బాలలం
ఆటపాటలందు
శ్రద్ధ ఉంచి
ఆడు బాలలం
పెద్దవారి యందు
భక్తి భయము నుంచు
బాలలం

బాలలం బాలలం
చిట్టి పొట్టి బాలలం
బాలలం బాలలం
భావితరపు పౌరులం

– ఆవుల వెంకటరమణ

## చిన్నారుల ప్రశ్నలకు వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్ గిరీష్ అంకుల్ సమాధానాలు

**ఎ.భాను, గుంటూరు**

జవాబు: మేఘాలు ఎలా రూపొందుతాయి?

జవాబు: మేఘాలు అంటే వాటికి ఒక ప్రత్యేక రూపం ఉండదు. గాలిలో ఉండే అసంఖ్యాక నీటి బిందువులు, ఐస్ క్రిస్టల్స్ కలసి ఏర్పడినవే. అంటే సూక్ష్మ బిందువుల రూపంలో గాలిలో చేరిన నీరు మనకు మేఘాల రూపంలో కనబడుతుంది. చల్లగాలి కంటే వేడిగాలిలోనే తేమ ఎక్కువగా ఉంటుంది. ఉష్ణోగ్రతా ప్రభావం వలన ఈ మేఘాలలోకి కొత్తగా నీటి బిందువులు వచ్చి చేరుతూనే ఉంటాయి. మేఘాలలో ఆర్ద్రతా శాతం సంతృప్తికర స్థాయికి చేరగానే అవి వర్షిస్తాయి. ఆ పరిస్థితులలో మేఘాలలోని సూక్ష్మబిందువులన్నీ కలిసిపోయి నీటి బిందువులుగా మారతాయి. భూమ్యాకర్షణ శక్తివలన అవి భూమి మీద వర్ష రూపంలో పడతాయి. మేఘాలలో ఆర్ద్రతా శాతం తగినంత స్థాయిలో వున్నప్పుడు చల్లటి గాలి వీచినా వర్షం రూపంలో నీటి బిందువులన్నీ కలిసి భూమి మీదకు జాలువారుతాయి.

**బి.సతీష్, కర్నూలు**

**ప్రశ్న: వాన పడే ముందు మబ్బులు నల్లగా ఎందుకు ఉంటాయి?**

జవాబు: వర్షం పడే ముందు మబ్బులు ఎక్కువగా సూర్యకాంతిని గ్రహిస్తాయి. అందువల్ల అవి నల్లగా మారతాయి. చిన్న చిన్న నీటి బిందువులతో మబ్బులు ఏర్పడతాయి కదా. వీటి మీద కాంతి ప్రసరించినప్పుడు ఆ బిందువులు పరావర్తనం చెందుతాయి. అందువల్ల మబ్బులు తెల్లగా కనిపిస్తాయి. వాన పడే ముందు నీటి బిందువులు సంఖ్య పెరుగుతుంది. అందువల్ల కాంతి అధికంగా పరావర్తనం చెందదు. ఈ దృష్ట్యా వాన పడే ముందు మబ్బులు నల్లగా కనిపిస్తాయి.







# తెలంగాణ మాల్దీవులు

**ప్రకృతి అందాలే కాదు.. ఆధ్యాత్మికతతో కూడిన ఆనందం సోమశిల సొంతం. పచ్చని అడవులు, కృష్ణానది, ఎత్తైన కొండలు ఇక్కడ పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి.**

ఏడు నదులు (కృష్ణ, వేణి, తుంగ, భద్ర, మలపహరిణి, భీమరథి, భావనాసని) కలిసే ప్రాంతంలో, పచ్చని అడవులు, ఎత్తైన కొండలు, సోమేశ్వర స్వామి ఆలయంతో కూడిన ప్రదేశం ఇక్కడ ఉంది. ఈ ప్రాంతాన్ని తెలంగాణ మాల్దీవులుగా కూడా పిలుస్తారు, ఇక్కడ బోటింగ్, ప్రకృతి దృశ్యాలను ఆస్వాదించవచ్చు.

సప్త నదుల సంగమం అంటే కృష్ణ, వేణి, తుంగ, భద్ర, మలపహరిణి, భీమరథి, భావనాసని అనే ఏడు నదులు ఒకచోట కలవడం సోమశిల ప్రత్యేకత. శ్రీ లలిత సోమేశ్వర స్వామి ఆలయం నది మధ్యలో ఉన్న ఒక ద్వీపంలో ఈ పురాతన ఆలయం ఉంది. ఇది సోమశిల ప్రత్యేక ఆకర్షణ.

## తెలంగాణ మాల్దీవులు

సోమశిల అందమైన ప్రకృతి దృశ్యాలు, నీటి ప్రాంతాల కారణంగా 'తెలంగాణ మినీ మాల్దీవులు' అని పిలువబడుతున్నాయి. ఇక్కడ బోటింగ్ చేసే అవకాశం ఉంది. ఇది ఈ ప్రాంత అందాలను దగ్గరగా ఆస్వాదించడానికి సహాయపడుతుంది. మొక్కాల్సిన గుడులు, ఎక్కాల్సిన కొండలు, చూడాల్సిన నిర్మాణాలు, సేద తీరాల్సిన విడిది కేంద్రాలు, ఆస్వాదించాల్సిన రుచులు, అబ్బురపడాల్సిన ప్రకృతి చమత్కారాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పరిసరాల్లో అనేకం.

నల్లమల పచ్చదనం, కృష్ణానది ప్రవాహం, ఆధ్యాత్మిక సౌరభం.. ఇలా కొల్లాపూర్ ప్రత్యేకతలు కోకొల్లలు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక సోమశిల పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందింది.

## కేబుల్ బ్రిడ్జికి శ్రీకారం

కృష్ణానదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి పనులకు త్వరలో శ్రీకారం చుట్టనున్నారు. దీంతో సోమశిల టూరిజం జంక్షన్‌గా



రూపుదిద్దుకోనున్నది. ఆ వైపు సంగమేశ్వరాలయం, ఈ వైపు సోమేశ్వరాలయం పుణ్యరాశిగా వెలిశాయి. ఇక్కడి ప్రకృతి అందాలు పాపికొండలకు దీటుగా నిలుస్తాయి. దీంతో పర్యాటకులు సోమశిలకు బారులు కడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉమ్మడి పాలమూరు జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి రూ.90 కోట్లు వెచ్చించింది. రూ. 20.86 కోట్లతో సోమశిలలో కాటేజీలు, లాంచీలు, హోటళ్ల ఏర్పాటు చేసింది.

పర్యాటకశాఖ నేతృత్వంలో సోమశిల నుంచి శ్రీశైలం వరకు సాగే లాంచీ యాత్ర మరపురాని అనుభూతి. మార్గమధ్యలో ఆంకాళమ్మకోట, పక్కనే నది మధ్యలో వెలసిన ద్వీపంలో జాలర్ల నివాసాలు అబ్బురపరుస్తాయి. అయితే ఆ వైభోగాన్ని నీళ్ల అడుగంటేలోపే చూడాలి. భారతదేశంలోనే తొలిసారిగా తెలంగాణలో సోమశిల కొత్తపల్లి (నంద్యాల జిల్లా) మండలం సిద్ధేశ్వరం మధ్య రెండు కొండల నడుమ కృష్ణా నదిపై 1.077 కిలోమీటర్ల ఐకాన్ కేబుల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఇది కనుక పూర్తయితే పర్యాటక రంగం పెద్ద ఎత్తు అభివృద్ధి చెందడమే కాదు.. నిత్యం వేలాది మంది ప్రయాణాలు సాగించడంతో ఈ ప్రాంతం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రాంతానికి మరింత పర్యాటక శోభ సంతరించుకుంటుంది.. అనడంతో ఎలాంటి అతిశయోక్తి లేదు.

## సంగమేశ్వరాలయం ప్రత్యేకత

సోమశిల ప్రాంతంలో మొత్తం పదిహేను దేవాలయాలు ఉన్నాయి. అవన్నీ ఎంతో ప్రసిద్ధి గాంచిన ఆలయాలుగా గుర్తింపు పొందాయి. అందులో ప్రధానంగా సోమశిల వద్ద నదిలో ఉండే సంగమేశ్వరాలయం.

ఆలయం నదిగర్భంలో ఉండడంతో వర్షాకాలం మొత్తం నదిలో మునిగి ఉంటుంది. నీటిమట్టం తగ్గిన తరువాత సుమారు మార్చి నుంచి నాలుగైదు నెలల పాటు ఆలయం తేలి ఉంటుంది. అందుకే వేసవి సమీపించే సమయంలో భక్తులకు దర్శన భాగ్యం కలుగుతుంది. ఒక వైపు దట్టమైన అడవులు, మరోవైపు ప్రకృతి సోయగాల..

కృష్ణా నది బ్యాక్ వాటర్ అందాలను రెట్టింపు చేస్తాయి. అలాంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగే ప్రయాణం మరింత మధురానుభూతిని ఇస్తుంది.

ప్రకృతి ఒడిలో ఉన్న సోమశిల క్షేత్రం నుంచి శ్రీశైలం జలాశయానికి లాంచిలో ప్రయాణించడం జీవితాంతం ఓ అనుభూతిలా మిగిలిపోతుంది. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించి వెళ్తుంటారు. శివరాత్రి, కార్తిక పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు ఆచరిస్తారు. నదిలోనూ నీరు పుష్కలంగా ఉండడం మూలంగా ఏడాదిలో సుమారు 8 నెలల పాటు అక్కడ బోటింగ్ సదుపాయం ఉంటుంది. బోటింగ్ ద్వారా అవతలి గట్టుకు చేరుకొని అక్కడి నుంచి ఆటోలు ఇతర ప్రైవేట్ వాహనాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ సైతం చేరుకోవచ్చు. సోమశిల వద్ద ఉన్న రెండు కొండల మీదుగా బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయి.

## ద్వాదశ జ్యోతిర్లింగాలు

సోమశిలలో ద్వాదశ జ్యోతిర్లింగాలు అంటే 12 లింగాలను ఒకేచోట చూసే అవకాశం ఉంది. వాటన్నింటినీ జీర్ణోద్ధరణ చేసి లలితా సోమేశ్వరాలయంలో ప్రతిష్టించారు. కాకతీయుల కాలంలో వీటిని మొదట ప్రతిష్టించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. సోమనాథ్, రామలింగేశ్వరం, భీమాశంకర్, ఘృశ్నేశ్వర్, త్రయంబకేశ్వర్, నాగేశ్వరం, విశ్వేశ్వరం, ఓంకారేశ్వరం, కేదారేశ్వర్, మహాకాళేశ్వర్, మల్లికార్జున, వైద్యనాథేశ్వర మొదలైన జ్యోతిర్లింగాలు ఉన్నాయి.

సోమశిలలో మొత్తం పదమూడు ఆలయాలు దర్శనమిస్తాయి. తొమ్మిది ఒక చోట, నాలుగు ఒకటిగా ఉన్నాయి. ఇవన్నీ చాళుక్యులు, రాష్ట్ర కూటులు, కాకతీయుల కాలంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతున్నది.





## ఇలా వెళ్లాలి..

హైదరాబాద్ నుంచి సోమశిలకు సుమారు 180 కి.మీ. దూరం ఉంటుంది. హైదరాబాద్ నుంచి కొల్లాపూర్‌కు నేరుగా ఆర్టీసీ బస్సులు ఉంటాయి. నాగర్‌కర్నూల్ చేరుకొని కూడా అక్కడి నుంచి కొల్లాపూర్ చేరుకోవచ్చు. వనపర్తి నుంచి వచ్చేవారు నేరుగా కొల్లాపూర్ చేరుకోవచ్చు. అక్కడి నుంచి 8 కి.మీ. దూరంలో సోమశిల ఉంటుంది.

## శ్రీశైలానికి లాంచి ప్రయాణం

సోమశిల నుంచి కృష్ణానదిలో లాంచి ప్రయాణం చేస్తూ శ్రీశైలం చేరుకోవచ్చు. కృష్ణా నదిలో నీళ్ల సమృద్ధిగా ఉండటంతో సోమశిల నుంచి శ్రీశైలం వరకు; నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం వరకు క్రూయిజ్ షిప్ టూర్‌ని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రారంభించింది. సోమశిల నుంచి శ్రీశైలం వరకు సుమారు 120 కి.మీ. దూరం ఉండగా ఆరు గంటల సమయం లాంచిలోనే ప్రయాణం సాగించాల్సి వస్తుంది. ఈ జర్నీలో అబ్బురపరిచే దృశ్యాలెన్నో ఉన్నాయి.

సోమశిల వద్ద బస చేయడానికి కాటేజీలు ఉన్నాయి. వివిధ సౌకర్యాలతో కూడిన కాటేజీలు సిద్ధంగా ఉన్నాయి. నది వ్యూ ప్రకృతి అందాలు తనివితీరా చూసేలా కాటేజీలు నిర్మించారు.

– నెలవెట్ల సతీష్‌కుమార్ రెడ్డి

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

sunmagvaartha@gmail.com

కథ

# మా ఊరెక్కడ?

మద్దు బాలు

**సబ్ ఇన్‌స్పెక్టర్ రఘురామ్ తన చాంబర్‌లో కూర్చొని కేసులకు సంబంధించిన ఫైల్స్ తిరగేస్తున్నాడు.**

**ఇంతలో కానిస్టేబుల్ రమణ లోపలికి ప్రవేశిస్తూ "సార్.. సార్..." అని పెద్దగా కేకలతో పిలిచాడు.**

**అతని పిలుపుకి ఉలిక్కిపడిన రఘురామ్ "ఏమిటి?" అన్నట్లు కానిస్టేబుల్ వైపు తలెత్తి చూశాడు.**

"సార్ మిమ్మల్ని కలవడానికి ఎవరో ఒక వ్యక్తి వచ్చాడు" చెప్పాడు రమణ ఆందోళనగా.

ఒక్క క్షణం ఆలోచించి "సరే..! లోపలికి పంపించు" అని మళ్లీ ఫైల్ చూడటంలో మునిగిపోయాడు రఘురాం.

కానిస్టేబుల్ రమణ ఆ వ్యక్తిని లోనికి అనుమతించాడు. ఆ వ్యక్తి లాల్చి పైజామా ధరించి వున్నాడు. భుజాన సంచి తగిలించుకుని సన్నగా ఉన్నాడు. చూడడానికి 'సాగర సంగమం' సినిమాలో కమల్‌హాసన్ లాగా ఉన్నాడు.

అతను లోనికి వస్తూనే సబ్ ఇన్‌స్పెక్టర్ రఘురామ్‌కి నమస్కరించాడు. అతనికి ఒళ్లంతా చెమటలు పట్టి వున్నాయి.

రఘురాం పైకి కిందకు ఎగాదిగా చూశాడు. కూర్చోమన్నట్టు కళ్లతో సైగ చేశాడు.

అతను కుర్చీలో కూర్చున్న తరువాత "చెప్పండి! ఏమిటి మీ సమస్య?" ఆ వ్యక్తి కళ్ళల్లోకి చూస్తూ సూటిగా అడిగాడు రఘురాం.

ఆ వ్యక్తి కొద్ది క్షణాలు మౌనం తరువాత మెల్లిగా పెదవి విప్పాడు.

"సర్! మా ఊరు మిస్సయింది" చెప్పాడు ఆ వ్యక్తి దీనంగా.

"వ్వాట్?" అదిరిపడ్డాడు రఘురాం.

తన జేబులో ఉన్న కర్చీఫ్ తీసి ముఖం మీద పట్టిన చెమటను తుడుచుకుంటూ "అవును సార్! నిజంగానే మా ఊరు మిస్సయింది" మళ్లీ అదే విషయాన్ని రిపీట్ చేశాడు ఆ వ్యక్తి.

అతను చెప్పింది విని ఎస్.ఐ. రఘురాం నిర్ఘాంతపోయి, ఆ వ్యక్తి వైపు కానిస్టేబుల్ రమణ వైపు మార్చి మార్చి విచిత్రంగా చూశాడు.

కొద్ది క్షణాల తర్వాత తేరుకుని కానిస్టేబుల్ చెవిలో "ఇతనికేమీ పిచ్చిపట్టలేదు కదా!" అన్నాడు.

దానికి కానిస్టేబుల్ తన దగ్గర సమాధానం లేక "ఏమో!" అన్నట్లు అయోమయంగా చూశాడు.

"మనుషులు, వస్తువులు, డబ్బు, బంగారం, నగలు, కార్లు, మోటారు సైకిళ్ళు, లగేజీలు మిస్సవటం తెలుసుగానీ.. ఈ ఊరు మిస్సవటం నేనెప్పుడు వినలేదే!" అంటూ ఆశ్చర్యపోయాడు ఎస్.ఐ. రఘురాం.

"లేదు సార్! నేను చెప్పేదంతా నిజం. దయచేసి నన్ను నమ్మండి. నిజంగానే మా ఊరు అక్కడ లేదు. ఏమయ్యిందో తెలియటం లేదు. కావాలంటే మా ఊరి ఫోటో చూడండి" అంటూ తన భుజాన తగిలించుకున్న సంచిలో నుంచి తన ఊరి ఫోటో తీసి ఎస్.ఐ గారి ముందు పెట్టాడు ఆదర్శ్.




రఘురాం ఆ ఫోటోను తేరిపారి చూసి తల పైకెత్తి "ఇంతకీ మీరెవరు? మీ పేరేమిటి? అసలు ఏం జరిగిందో కాస్త వివరంగా చెప్తారా? అడిగాడు అతని దగ్గర నుంచి వివరాలు రాబట్టాలని.

"అలాగే సార్! అసలు ఏం జరిగిందో చెప్తాను. నా పేరు ఆదర్శ్. నేను హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో ఫొటోగ్రఫీ విభాగంలో ఫైన్ ఆర్ట్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశాను.

తరువాత మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో చేయడానికి అమెరికా వెళ్లాను. రెండు సంవత్సరాలు అమెరికాలో మాస్టర్స్ చేసిన తరువాత మా సొంత ఊరికి వచ్చేశాను. కానీ మా ఊరు అక్కడ లేదు. మా ఇల్లు మాత్రమే ఉంది. మా ఊరికి బదులు మా ఇంటి చుట్టూ ఎత్తైయిన అపార్ట్‌మెంట్స్, డూప్లెక్స్‌లు, విల్లాలు, విశాలమైన రోడ్లు అవుటర్ రింగ్ రోడ్డులు, ఇన్నర్ రింగ్ రోడ్లు. ఫ్లై ఓవర్స్, హోటల్స్, రెస్టారెంటులు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, షాపింగ్ మాల్స్, క్లబ్‌లు, పబ్‌లు, స్టేడియంలు, మెట్రో స్టేషన్ లాంటి పెద్ద పెద్ద నిర్మాణాలు" వెలిసి వున్నాయి.

నాకు అమెరికాలో మంచి ఉద్యోగం కూడా దొరికింది. కానీ మా ఊరి మీద ఉన్న మమకారంతో అక్కడ ఉద్యోగం చేయలేకపోయాను.

మా ఊరి ప్రకృతి అందాలను నా కెమెరాలో బంధించాలని, ఆ ఫొటోలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించాలని ఎంతో ఆరాటంతో అమెరికా నుండి మా ఊరు వచ్చేశాను. కానీ మా ఊరు అక్కడ లేకపోయేసరికి ఎంతో బాధపడ్డాను. ఇప్పుడు అక్కడ అంతా బస్తీ అయ్యింది. మా పచ్చని పల్లెని ధ్వంసం చేసి మోడ్రన్ సిటీగా తయారు చేశారు. పల్లెటూరి వాతావరణాన్ని సిటీ కల్చర్‌గా మార్చేశారు" అంటూ తన గుండె పొరల్లో దాగిన బాధను తెలియ జేశాడు ఆదర్శ్.

తన సమస్యని అర్థం చేసుకున్న ఎస్ఐ రఘురాం "ఆదర్శ్! మీరు చెప్పేది అక్షరాల నిజం. ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారులు,

**"మరి దీనికి పరిష్కారం లేదా? వారిలో మార్పు రాదా? సార్" ప్రశ్నించాడు.**

**"ప్రజలలో స్వార్థం ఉన్నన్ని రోజులు దీనికి పరిష్కారం దొరకదు. మనిషి డబ్బు, సంపద, సుఖాలు, బోగాలు, సౌకర్యాలు వెంటపరిగెడుతున్నన్ని రోజులు మార్పు తీసుకురాలేం ఆదర్శ్" అని నిట్టూర్చాడు ఎస్.ఐ. రఘురాం.**

పెట్టుబడిదారులు ఎక్కడ పడితే అక్కడ లే అవుట్‌లు వేసి మోసపూరిత మాటలతో ప్లాట్లు, ఇళ్ళు, అమ్ముకుని కోట్లు గడించారు. ప్రభుత్వం నుండి అనుమతులు రాకపోయినా చెరువులు, కుంటలలో కూడా నాసికరకమయిన బిల్డింగ్‌లు కట్టి అమాయక ప్రజలకు అమ్మి కోట్లకు పడగలెత్తారు. అది చాలక ఇప్పుడు పల్లెటూర్లకు వచ్చి రైతులని మోసం చేసి సంవత్సరానికి రెండు, మూడు పంటలు పండే పచ్చని పొలాలను డబ్బు ఆశ చూపి కారుచౌవగ్గా కొట్టేసి వెంచర్‌లు వేసి ఎయిర్‌పోర్ట్ మంజూరయిందని, మెడికల్ కాలేజిలు కడుతున్నారనీ, సాఫ్ట్‌వేర్ కంపెనీలు వస్తున్నాయని కస్టమర్స్‌కి మాయమాటలు చెప్పి అధిక ధరలకు తమ ప్లాట్స్, విల్లాలు, అపార్ట్‌మెంట్స్ అమ్ముకుని లక్షల కోట్లు సంపాదిస్తున్నారు. వారి స్వార్థం కోసం పచ్చని పంటపొలాల నుండి వీచే స్వచ్ఛమైన పైరగాలి, పరిశుభ్రమైన నీరు, ఆహ్లాదకరమయిన ప్రకృతిని సర్వనాశనం చేస్తున్నారు. దీనితో పర్యావరణం దెబ్బతిని మనిషి మనుగడకే ముప్పు వస్తోంది" అని వ్యాపారస్థుల మీద అసహనం వ్యక్తం చేశారు.

"మరి దీనికి పరిష్కారం లేదా? వారిలో మార్పు రాదా? సార్" ప్రశ్నించాడు ఆదర్శ్.

"ప్రజలలో స్వార్థం ఉన్నన్ని రోజులు దీనికి పరిష్కారం దొరకదు. మనిషి డబ్బు, సంపద, సుఖాలు, భోగాలు, సౌకర్యాలు వెంట పరుగెడుతున్నన్ని రోజులు మార్పు తీసుకురాలేం ఆదర్శ్" అని నిట్టూర్చాడు రఘురాం.

"నేడు పట్టణాలలో ఎక్కడ చూసినా వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం వలన ప్రజల ఆరోగ్యం పాడవుతోంది. పల్లె వాతావరణం మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అటువంటి పల్లెల్లోకి పట్టణ కాలుష్యంతో పాటు విదేశీ కల్చర్‌ని కూడా మోసుకొచ్చారు. విదేశీ సంప్రదాయాల్ని, ఆచారాలని, అలవాట్లని కూడా దిగుమతి చేసుకున్నారు ఈ బస్తీవాసులు" వారి జీవన విధానాన్ని ఏవగించుకున్నాడు ఆదర్శ్.

"మన ప్రభుత్వాలు ముందుకొచ్చి కొన్ని చట్టాలు రూపొందించి వాటిని అమలు పరిస్తే వీటన్నింటికి అడ్డుకట్ట వేయొచ్చు, మన పల్లెలని కాపాడవచ్చు" చెప్పాడు రఘురాం.

"మన పల్లెటూర్లో జీవించటం ఎంత ఆనందంగా ఉంటుందంటే, నా చిన్నప్పుడు మా ఊరిలో ప్రాథమిక పాఠశాలలో చదువుకునే రోజుల్లో మా ఊరి చెరువు గట్టు మీద, కాలువ గట్ల మీద ఆడుకునేవాళ్లం. పిల్ల కాలువల్లో ఈత నేర్చుకునేవాళ్లం. వర్షం వచ్చిందంటే చాలు పిల్లలందరం కాగితాలతో పడవలు తయారు చేసి వాటిని నీటి కాలువల్లో వదిలేవాళ్ళం. అవి నీటి మీద తేలియాడుతూ వెళుతుంటే గెంతులు వేస్తూ ఎంతో సంబరపడిపోయేవాళ్లం. మేట వేసిన ఇసుకల్లో గుజ్జన గూళ్లు కట్టేవాళ్లం.

సజ్జచేలల్లో దూరి సజ్జ కంకులు కోసుకుని నిప్పుల మీద కాల్చుకుని తినేవాళ్లం. ఈతచెట్లు, తాటి చెట్లు ఎక్కి వాటి కాయలు కోసుకుని తినేవాళ్లం. మామిడితోపుల్లో దూరి మామిడికాయలు కోసుకుని వాటిని పగలగొట్టి ఉప్పు, కారం చల్లుకుని తినేవాళ్లం. దోర చింతకాయలు కోసుకునే తినేవాళ్లం. ప్రతి రోజు మా ఊరి రామాలయంలో పెట్టే ప్రసాదం కోసం అందరం కుస్తీ పట్టేవాళ్లం. పండు వెన్నెల్లో కోతి కొమ్మచ్చి, చెడుగుడు ఆటలు ఆడుకునేవాళ్లం.

వెన్నెల రాత్రులలో ఆడపిల్లలతో కలిసి ఎన్నో ఆటలు ఆడుకునేవాళ్లం. మాకు చదువు చెప్పిన మాష్టారు శర్మగారికి ఇంటి వెనుకవైపు పెరట్లో ఉన్న జామ చెట్టుకు కాసే తీయని జామకాయలు గోడ దూకి దొంగతనంగా కోసుకుని తినేవాళ్లం. మా ఊరి రామాలయం వద్ద చెప్పే హరికథలు, బుర్రకథలు, తోలు బొమ్మలాటలు, మా మిత్రులతో కలిసి వెళ్లి చూస్తూ అక్కడే నిద్రపోయేవాళ్లం.

సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు.. మాకు పది రోజులు బడికి సెలవులొచ్చేవి. భోగి పండక్కి తుమ్మ, రేగికంప తెచ్చి తెల్లవారుఝామున లేచి భోగిమంటలు వేసేవాళ్లం. ఉదయాన్నే తలంటు స్నానం చేసి కొత్త బట్టలు తొడుక్కుని ఇంటింటికి తిరిగి అందరికి చూపించేవాళ్ళం.

ప్రతిరోజు ఉదయాన్నే పక్షులు తమ తమ కిలకిలా రావాలతో మమ్మల్ని నిద్ర మేల్కొలిపేవి. కోకిల మామిడి తోటల్లోని మావిచిగురు తిని కమ్మగా పాటలు పాడేది. మా ఊరి చుట్టూ పచ్చని పంట పొలాల్లో పచ్చని చీరె కప్పినట్టుగా ఉండేది. పచ్చని పొలాల మధ్య మా ఊరు ఎంతో రమణీయంగా ఉండేది. ఎన్నో అనుభూతులు, మరెన్నో ఆనందాలు, ఎన్నెన్నో జ్ఞాపకాలు.. నా మదిలో ఇప్పటికి పదిలంగా ఉన్నాయి.

అందుకే మా ఊరంటే నాకు చాలా ఇష్టం. కన్నతల్లి లాంటి మా ఊరంటే నాకు వల్లమాలిన ప్రేమ" ఊరి తాలుకు జ్ఞాపకాలు నెమరు వేసుకున్నాడు ఆదర్శ్.



అలాంటి మా ఊరిని రియల్టర్‌లు, పెట్టుబడిదారులు వచ్చి వారి స్వార్థం కోసం విధ్వంసం చేశారు. ఇంతకు ముందు మా ఊరు ఎలా ఉందో అలా చెక్కు చెదరని ప్రకృతి అందాలున్న అందమైన మా ఊరు నాకు కావాలి సార్" అంటూ భావోద్వేగానికి లోనయ్యాడు ఆదర్శ్.

కన్న ఊరిని కూడా కన్నతల్లిలాగా ప్రేమిస్తున్న ఆదర్శ్ మీద అభిమానం పెరిగింది రఘురామ్‌కి.

తన ఊరు కావాలని కోరుకున్న నిష్కల్మషమైన కోరిక న్యాయబద్ధంగా ఉందని గ్రహించాడు రఘురామ్.

"చూడండి ఆదర్శ్‌గారు! మీ ఆవేదన నాకర్థమయింది. కాని మన దౌర్భాగ్యం ఏంటంటే స్వార్థపరులయిన మన మనుషులు ప్రకృతిని నాశనం చేయటం తెలుసు కానీ.. దానిని బాగుచేయటం మాత్రం చేతకాదు" అని మనుషుల నైజాన్ని చెప్పాడు రఘురాం.

"ఏదైనా మనం బాగు చేయ లేనప్పుడు నాశనం చేసే హక్కు ఎవరిచ్చారు?" మనుషుల నిర్లక్ష్యపు ధోరణిని ప్రశ్నించాడు ఆదర్శ్.

"ఆదర్శ్, మీ బాధను, ఆవేదనను నేను అర్థం చేసుకోగలను. కానీ మీ ఊరునయితే తెచ్చివ్వడం సాధ్యపడదు, మీ సమస్యకి ప్రత్యామ్నాయ మార్గం మాత్రం చూపగలను. ఆదర్శ్ నాకు రెండు రోజుల సమయం ఇవ్వండి. దీనికి పరిష్కార మార్గం వెతుకుతాను" అని భరోసా ఇచ్చాడు రఘురాం.

"ఆ.. మీ ఇంటి అడ్రస్ ఇచ్చి వెళ్లండి" అని చెప్పాడు రఘురాం.

తన సమస్యని అర్థం చేసుకుని, తనకి పరిష్కారం చూపుతానని మాట ఇచ్చినందుకు ఎస్‌ఐ రఘురాంకు కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయాడు ఆదర్శ్.

రెండు రోజుల తరువాత ఎస్‌ఐ రఘురాం తన పోలీసు జీపులో ఆదర్శ్ ఇంటికి వెళ్లి ఆదర్శ్‌ని జీపులో ఎక్కించుకుని చాలా దూరం ప్రయాణించి, చుట్టూ పచ్చని పొలాల మధ్య ఒక చోట జీపుని ఆపి, పచ్చని పంటపొలాల మధ్య చిన్న కుటీరం ఏర్పాటు చేసి వున్న కొంత స్థలాన్ని చూపించి– "మన తహశీల్దారు గారితో మీ సమస్యని తెలియజేసి మీ కోసం కొంత నివాస స్థలాన్ని మీ పేరు మీద ఇప్పించడం జరిగింది.

మీరు ఇక నుండి ఇక్కడే ప్రకృతి ఒడిలో జీవించవచ్చు ఆదర్శ్" అని చెప్పాడు రఘురాం.

తన కోసం ఇంత చేసిన ఎస్‌ఐ రఘురాం గారికి ఆనంద బాష్పాలతో తన హృదయపూర్వక కృతజ్ఞతలు చెప్పాడు ఆదర్శ్.

ఆదర్శ్ కళ్లల్లో ఆనందాన్ని చూసి సంతృప్తిగా జీపు ఎక్కబోతున్న ఎస్‌ఐ రఘురాంను గట్టిగా "సార్" అని పిలిచాడు ఆదర్శ్.

"ఏమిటి ఆదర్శ్! మళ్లీ ఏమైంది?" అడిగాడు రఘురాం.

"సార్! ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇక్కడికి కూడా వస్తారేమో!" అని తన సందేహం వెలిబుచ్చాడు.

"అప్పుడు మీకు ఇంకొక పరిష్కార మార్గం చూపిస్తాను.." అన్నట్లు కళ్లతోనే జవాబు చెప్పి తన జీపుతో ముందుకు సాగిపోయాడు ఎస్.ఐ. రఘురాం. ■

– మనిషి తన అంత్యక్రియలతో అంతమయ్యే భవిష్యత్‌లోని కొన్ని భాగాలనైనా ముందుగా చూడగలడు.
– లార్డ్ బైరన్

– మాట తూలితే అదృష్టం వెక్కిరించడం ఖాయం.
– షేక్‌స్పియర్

కాకతీయ మహారాజ్ఞి రుద్రమ దేవి, నవలను తొలి తొలుత అఖ్యాయికగా ఒద్దిరాజు సీతారామ చంద్రరాయ శర్మ రచించి విజ్ఞాన ప్రచారిణి గ్రంథమాల ప్రచురణగా 1918లో ప్రచురింపచేసారు. ఆ నవలలోని పాత్రలు, కథ 'ఆంధ్రుల చరిత్రము', హిందూ దేశ కథా సంగ్రహం నుండి సేకరించినట్లు మొదటి కూర్పు పీఠికలో రచయిత పేర్కొన్నారు. ఉర్దూ రాజ భాషగా ఉన్న నిజాం ప్రభుత్వ రాజ్యంలో, ఓరుగల్లు సమీప గ్రామం మానుకోట తాలూకా

# ఒద్దిరాజు 'రుద్రమ'



ఇనుగుర్తి వాస్తవ్యులు అయిన ఒద్దిరాజు సోదరులు తెలుగులో నవల ప్రచురింపచేయటం ఆ రోజులలో సాహసమైంది. 'నిరుపమాన శౌర్య ప్రతాపు'లను పేరు వడసిన సుప్రసిద్ధాంధ్రుల చరిత్రములు రాసి, భాషా సేవ చేయవలయుననే సంకల్పంతో ఒద్దిరాజు వారు, తెలుగు సాహిత్య తొలిదశలో పరిశోధనాసక్తితో ఈ అఖ్యాయిక రచించారు. అపరాధ పరిశోధన కథాగతిలో, రుద్రమ జీవితంలోని వాస్తవిక కథనానికి సన్నివేశ కల్పనా వైచిత్రితో, ఆ వీరనారి ఎదుర్కొన్న సవాళ్లను ధైర్య సాహసగాథగా సృజనాత్మక వర్ణనా భావుకతతో గ్రాంథిక భాషలో వెలువరించారు. ఈ తొలి తొలుత చారిత్రక పరిశోధనా సృష్టికి, అప్పటి వరకు లభించిన శిలాశాసనాలు, జన శ్రుతి ఆధారమైంది.

కాకతీయ చక్రవర్తులు జైనులను హింసించారనే చారిత్రక అంశానికి ప్రమాణం లేదు. కథారంభంలో రుద్రమ తండ్రి గణపతిదేవుడు జైన హింససాగించిన కారణంగా రాణి రుద్రమను చంపవలెననే కుట్ర వర్ణించబడింది. కాకతీయుల శత్రువైన యాదవ దేవగిరి రాజు పన్నిన కుట్రలో భాగంగా, అదను చూసి రుద్రమను మట్టు పెట్టడానికి పన్నాగం పేర్కొనబడింది. మురారి దేవుడు, హరిహర దేవుడు యిద్దరూ జ్ఞాతివైరం కారణంగా దేవగిరి మహారాజును ఆశ్రయించడం, రుద్రమను సంహరించే కుట్ర పన్నడం కథాగతికి సహజంగా ఉన్న అంశాన్ని, సన్నివేశాలను ఆస్వాద్యత, రక్తి కలిగించే నవలా అఖ్యాయికగా ఒద్దిరాజు వారు రూపొందింప చేసారు. ఒద్దిరాజు వారి స్వస్థలం ఇనుగుర్తి గ్రామంలోని ఒక శాసనాధారంగా గణపతి రాజు తల్లిదండ్రుల వృత్తాంతం, మల్కాపురం శాసనాధారంగా రుద్రమ, గణపతి రాజు కుమార్తె అని అప్పటికే స్పష్టమైంది. రుద్రమదేవికి మమ్మడమ్మ, రుయ్యమ్మ యిద్దరు కుమార్తెలని, చాళుక్య వంశానికి మైళము భీమన వంశజులకు యిచ్చి వివాహం చేసినట్లు యిద్దరు అల్లుళ్లు కాకతీయ సామ్రాజ్య పరిరక్షణకు రెండు భుజాలుగా ఉన్నారని ఒద్దిరాజు వారు తన నవలలో ఉదహరించారు. తండ్రి మరణానంతరం, మంత్రి శివదేవయ్య సహాయంతో రుద్రమ పిత్ర సింహాసనం అధిష్ఠించిందనీ, తనకు పుత్రులు లేనందున కుమార్తెలు సంతాన ప్రాప్తి పొందాలనే చారిత్రక వాస్తవం ఆధారంగా ఈ నవల చిత్రీకరించబడింది. రుద్రమదేవి కుమార్తెలతో సహా వడ్డెపల్లి బుద్ధ గణపతి, మొగలిచెర్ల ఏకవీరా దేవి సందర్శనకు సంతాన ప్రాప్తికోసం కోటలోంచి వచ్చేటట్టుగా చేసి అక్కడ వారిపై దాడి చేసి సంహరించే కుట్ర నడుస్తుంది. గోన బుద్ధారెడ్డి ఈ కుట్ర పసిగట్టి మురారి, హరిహర దేవులు, ధర్మవర్ధనున్ని చంపి కుట్ర భగ్నం చేసి రుద్రమ దేవిని, ఆమె కుమార్తెలను రక్షించి సురక్షితంగా ఓరుగల్లు కోట చేరుస్తాడు. రుద్రమ దేవి తన ముత్యాల ఖడ్గాన్ని బహూకరించిన వృత్తాంతం వుంది. ఒద్దిరాజు వారు 13 అధ్యాయాలలోని ఈ నవలలో యుద్ధ ప్రయత్నంలో ఓరుగంటి కోటల నిర్మాణం, పటిష్టతా చర్యలు మూడు లక్షలకు మించిన సైనికబలం వివరాలు పేర్కొన్నారు. శౌణ దేశాధిపతి దేవగిరి మహా దేవరాజు ఓరుగల్లు కోట ముట్టడి, అతి భీకర పదిహేను రోజుల సంగ్రామంలో రుద్రమ పురుష రూప ధృతగా, ఉత్తమ అశ్వాన్ని అధిరోహించి వీరనారిగా శత్రుసైన్యాన్ని తరిమి కొట్టి మహాదేవరాజును ఘోర పరాజితున్ని చేసి సమగ్రాంధ్ర రాజ్యాన్ని సుఖశాంతులతో పరిపాలించిన కథనం ముగింపుతో నవల సుఖాంతమైంది. అఖరి అధ్యాయం సంధిలో మహా దేవరాజు పరాజయం పలాయనం, యుద్ధవ్యయం కింద ఐదు కోట్ల ధనం, యాభై ఏనుగులు, నూరు గుర్రాలు సమర్పించుకోవడం రుద్రమ దేవి జయశాసనాలు స్థాపించి, సైనికులకు పదిలక్షల హొన్నులు బహూకరించటం వివరించారు. శతాబ్ది కాలం క్రితం బెజవాడలో ముద్రించబడిన ఈ నవలకు అక్కినేపల్లి జానకి రామారావు జాగీర్దార్ సంపాదకునిగా వ్యవహరించారు. తెలుగులో తొలి నవలగా వెలుగు చూసిన ప్రచురణ, సుప్రసిద్ధ చిత్రకారులు కొండపల్లి శేషగిరిరావు అపూర్వ కళాసృష్టి రుద్రమ దేవి పెయింటింగ్ ముఖచిత్రంతో పునర్ముద్రించబడింది. రుద్రమ దేవికి, నిడుదవోలు చాళుక్య వీరభద్రుని వైవాహిక దాంపత్య కథనం అప్పటికి వెలుగు చూడకపోవడం కారణంగా ఈ అఖ్యాయికలో ఆ ప్రస్తావన రాలేదు. ఈ తొలి అద్భుత నవలకు కొమర్రాజు లక్షణరావు సారధ్యంలోని విజ్ఞాన చంద్రికా మండలి స్వర్ణ పతకాన్ని బహూకరించింది.

ఒద్దిరాజువారి ఈ నవల తర్వాతి దశాబ్దాలలో పలువురు నోరి నరసింహశాస్త్రి, అడవి బాపిరాజు, భోగరాజు నారాయణమూర్తి, ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు, డా॥ కసిరెడ్డి వంటి ప్రముఖ రచయితలు ఎందరో రుద్రమ దేవి జీవిత విశేషాలను నవలలుగా రూపొందించారు.

– జయసూర్య

# వింత విహంగాలు



కింగ్ వల్చర్

మనునిత్యం మనం అనేక రకాల పక్షులను తిలకిస్తుంటాం. అయితే అరుదైన పక్షులు కనిపించినప్పుడు అలౌకికానందం పొందుతుంటాం. అటువంటి కొన్ని పక్షుల గురించి తెలుసుకుందాం.

## అతి పెద్ద పక్షి కింగ్ వల్చర్

ఇది దక్షిణ అమెరికాలో అరుదైన, వింతైన అతిపెద్ద పక్షిగా ప్రసిద్ధి చెందింది. అందుకు తగ్గట్టే ఈ పక్షి చాలా గంభీరంగా కనిపిస్తుంది. దీన్ని తెలుగులో రాజ రాబందు అని కూడా పిలుస్తారు. ఇది న్యూ వరల్డ్ వల్చర్ కుటుంబానికి చెందిన ఒక పెద్ద రాబందు జాతికి చెందినది. కింగ్ వల్చర్‌ను చూసి అనేక పక్షులు భయపడిపోతాయి. ఈ పక్షి అమెరికాతో పాటు గునియా, బ్రెజిల్, అర్జెంటినా, మెక్సికో ఇత్యాది దేశాలలో కూడా కనిపిస్తుంది. దక్షిణ అమెరికా సంస్కృతిలో కింగ్ వల్చర్‌ను గౌరవనీయ పక్షిగా భావిస్తారు. దీని రెక్కలు బాల్యంలో శ్వేత వర్ణంలో ఉంటాయి. వయస్సు పెరిగేకొద్ది ముదురు బూడిద, నలుపు రంగు.. ఇలా పలు మార్పులు జరుగుతాయి. దీని తలపై రంగు రంగుల చర్మం ఉంటుంది. ఈ రంగులు దాని వయస్సు, ఆరోగ్యాన్ని సూచిస్తాయి. ఎరుపు, పర్పుల్, మెడపై నారింజ రంగు, గొంతు మీద పసుపు రంగులు ఉంటాయి. కింగ్ వర్చర్ పక్షి ముక్కు నారింజ, నలుపు రంగుల్లో ఉంటుంది. కళ్ళు తెల్లగా ఉంటాయి. ఇది పుట్టినప్పుడు సాధారణ పక్షిలానే కనిపిస్తుంది. పుట్టిన నాలుగేళ్ళ తరువాత దీని రూపం, రంగు అన్నీ మారిపోతాయి.

పక్షి పొడవు 65 నుండి 80 సెంటీ మీటర్ల వరకు ఉంటుంది. దీని రెక్కల పొడవు ఒక మీటరు పైబడి ఉంటాయి. మాయన్ నాగరికతలో కింగ్ వల్చర్‌ను దేవతల దూతగా పరిగణించేవారు. ఈ పక్షి ఆకాశం నుండి దేవతల సందేశాలను తీసుకు వస్తుందని వారి నమ్మకం,

కింగ్ వల్చర్ పక్షులు సామూహిక జీవితాన్ని ఇష్టపడవు. ఎంతో అత్యవసర పరిస్థితుల్లోనే సమూహంగా కనిపిస్తాయి. ఇది ఎక్కువగా ఎగురుతూ ఆహారం వేటలో సంచరిస్తుంది. ఈ పక్షి గంటకు దాదాపు 50 కి.మీ వేగంతో ఎగరగలదు. చేపలను మహా ఇష్టంగా తింటుంది. కింగ్ వల్చర్ శవాహారి. చనిపోయిన జంతువుల మాంసాన్ని ఇది తింటుంది. ఎంత ఎత్తులో ఎగురుతున్నప్పటికీ నేలపై ఉన్న జంతువుల శవాలను ఇట్టే పసికట్టగలదు. గద్దలతో పోలిస్తే కింగ్ వల్చర్ ముక్కు ఇంకా బలంగా ఉంటుంది. కింగ్ వల్చర్ చనిపోయిన జంతు కళేబరాలను తినడం వల్ల దుర్వాసన, వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రధాన పాత్రను పోషిస్తుందని చెప్పవచ్చు. ఆహారం తిన్న పిదప సమీపాన ఉన్న చెరువుకు వెళ్ళి స్నానం చేస్తాయి. కింగ్ వల్చర్ పక్షులు పాతికేళ్ళు పైబడి జీవిస్తాయి. వీటికి తగిన రక్షణ కల్పిస్తే 40 సంవత్సరాల వరకు జీవిస్తాయి. ఈ పక్షులు సాధారంగా చెట్ల బోలు భాగాలు, రాళ్ళ మధ్య గుడ్లు పెడతాయి. సుమారు 60 రోజుల వ్యవధిలో గుడ్లు పొదుగుతాయి. ఆడ, మగ పక్షులు కలసి ఈ గుడ్లను పొదగి పిల్లల్ని బయటకు తెచ్చి పెంచుతాయి. అంతర్జాతీయ ప్రకృతి సంరక్షణ సంఘం సర్వే ప్రకారం కింగ్ వల్చర్ పక్షులు చాలా తక్కువగా ఉన్నాయి. వీటిని పరిరక్షించడానికి కృషిచేయాలి.

## ఎగరలేని చిలుక కాకాపో

ప్రపంచంలో ఎగరలేని ఏకైక అతి పెద్ద చిలుక కాకాపో, ఈ పక్షి న్యూజిలాండ్ అడవుల్లో మాత్రమే కనిపిస్తుంది. దీన్ని గుడ్లగూబ చిలుక అని పిలుస్తారు. కారణం దీని ముఖం గుడ్లగూబలా ఉంటుంది. ఇది రాత్రివేళల్లో సంచరించే ఎగరలేని చిలుక, దీని పొడవు 58 నుండి 64 సెంటీమీటర్ల వరకు ఉంటుంది. మగ పక్షులు



రెండు నుండి నాలుగు కిలోల వరకు బరువు ఉంటాయి. ఆడ పక్షులు మగ వాటి కంటే కొంచెం బరువు తక్కువగా ఉంటాయి.

ఈ పక్షి రెక్కలు చిన్నవిగా ఉంటాయి. ఆకుపచ్చ, పసుపు, గోధుమ మిశ్రమంతో ఉంటు చెట్ల ఆకులతో కలిసిపోయే విధంగా కనిపిస్తుంది. కాకాపో పక్షిరెక్కలు చిన్నవిగా ఉంటాయి. పర్వతాలపై ఎక్కడం, నేలపై నడవడం చేయగలదు. కాకాపో పక్షులు రాత్రివేళల్లో ఆహారం కోసం వెతుకుతాయి. ఇవి చెట్ల అడుగున, చెట్ల వేర్ల వద్ద నివసిస్తాయి. మగ పక్షులు బూమింగ్ కాల్ అనే గంభీరమైన శబ్దాన్ని చేసి ఆడ పక్షులను ఆకర్షిస్తాయి. గంభీరమైన ఈ శబ్దం 5 కి.మీ దూరం వరకూ వినిపిస్తుంది. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే కాకాపో పక్షి శాకాహారి, ఆకులు, పువ్వులు, విత్తనాలు, పండ్లు తింటుంది. ప్రత్యేకించి రిము చెట్టు పండును మక్కువగా తింటుంది. రిము చెట్టు పండ్లు పుష్కలంగా విరగకాచే సమయంలో గుడ్లు పెడుతుంది. రెండు లేదా నాలుగు సంవత్సరాలకోసారి మాత్రమే గుడ్లను పెడతాయి. గుడ్ల సంఖ్య సాధారణంగా ఒకటి లేదా నాలుగు వరకు మాత్రమే పెడతాయి.

ఆడ పక్షి మాత్రమే పిల్లల్ని సాకే బాధ్యతను తీసుకుంటుంది. 1990లో కాకాపో పక్షులు సంఖ్య కేవలం 50 మాత్రమే మిగిలి ఉన్నాయని న్యూజిలాండ్ ప్రభుత్వం చేసిన సర్వేలో తేలింది. నాటి నుండి వీటిని పరిరక్షించడానికి అహర్నిశలు ప్రయత్నించారు. ప్రస్తుతం 2025 నాటికి సుమారు 250కు పైగా కాకాపో పక్షులను పలు దీవుల్లో సురక్షితంగా సంరక్షిస్తున్నారు. కాకాపో పక్షులు 60 నుండి 90 సంవత్సరాల వరకు జీవిస్తుంది. న్యూజిలాండ్ ప్రజలు ఈ పక్షులను తమ దేశానికే గర్వకారణంగా భావిస్తారు.

## వింతైన అద్భుత పక్షి హోట్జిన్

వింత విహంగాలలో మరొకటి హోట్జిన్ పక్షి, దీని శాస్త్రీయ నామం ఒపిస్తోకోమిడ్ హోట్జిన్. ఈ పక్షి ఒపిస్తోకోమిడ్ కుటుంబానికి చెందినది. అతి సుందరంగా కనిపించే ఈ పక్షి దక్షిణ అమెరికాలోని బ్రెజిల్, గయానా, ఈక్వెడార్, వెనిజులా,



పెరూ, కొలంబియా, సురినేమ్ ఇత్యాది దేశాలలో ఎక్కువగా కనిపిస్తుంది. ఇవి దక్షిణ అమెరికాలోని అమెజాన్, ఒరినోకో ప్రాంతాల్లోని చిత్తడి నేలలు, మడ అడవుల్లో అధికంగా జీవిస్తాయి. హోట్జిన్ పక్షిచూస్తే భలే అందంగా ఉంటుంది. కానీ దాని ఒంటి నుండి మనం భరించలేని దుర్వాసన వస్తుంటుంది. దీనికి కారణం వీటి శరీరంలోని ప్రత్యేక జీర్ణవ్యవస్థే అని నిపుణులు చెబుతున్నారు. దాదాపు అన్ని పక్షులకు తమ ఆహారాన్ని వెనుక భాగంలో జీర్ణ చేసుకోవడానికి వీలుంటుంది. అయితే హోట్జిన్ పక్షులు మాత్రం ముందు భాగం తమ ఆహారాన్ని పులియబెట్టుకునే నిర్మాణాన్ని కలిగివున్నాయి. దుర్వాసనకు ఇది కూడా ఒక కారణమే. హోట్జిన్ పక్షిని స్టింక్‌బర్డ్ అని కూడా పిలుస్తారు. స్టింక్ అంటే దుర్గంధం అని అర్ధం. అందుకే దీనికి ఆ పేరు వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో దీన్ని కంకబర్డ్ అని కూడా పిలుస్తారు. ఈ దుర్వాసనే వీటికి రక్షణ కల్పిస్తుందంటే ఆశ్చర్యం కలగకమానదు. దుర్గంధభరితమైన ఈ వాసన వల్ల వేటగాళ్లు వీటిని తినరు. ఇతర జీవులు సైతం వీటిని తినడానికి ఇష్టపడవు. ఈ పక్షుల శరీరం నుండి వచ్చే దుర్గంధాన్ని పీలిస్తే బహుశా ఇవి కుళ్లిపోయిన మాంసమా? అనే భావన మాంసాహారులకు కలుగుతుంది.

హోట్జిన్ పక్షుల శరీరం 65 సెంటీమీటర్ల పొడవు వుంటుంది. గోధుమరంగు ఈకలు, ఎరుపురంగు కళ్ళు, తలపై నీలం రంగు కిరీటం లాంటి ఈకలను కలిగి వుంటాయి.

ఈ పక్షులకు రెక్కలపై గోళ్ళు ఉంటాయి. ఇవి చెట్టు ఎక్కడానికి సాయపడతాయి. వీటి రెక్కలకు ఎగరడానికి సాధారణ పక్షుల అంత నైపుణ్యాన్ని కలిగివుండవు. పెద్దగా గాలిలో ఎగరలేవు. కొంత ఎత్తు వరకు మాత్రమే ఎగర గలవు. ఎప్పుడైనా ప్రమాదాలు సంభవించినప్పుడు బలాన్ని కూడగట్టుకుని కొంత ఎత్తు వరకు ఎగురుతాయి. ఆ కారణంగా ఇవి చెట్లమధ్య గెంతుతూ ఉంటాయి.

హోట్జిన్ పక్షులు శాకాహారులు, ఆకులు, పువ్వులు, పండ్లను తింటాయి. జీర్ణక్రియకు 45 గంటల సమయం పడుతుంది. అవన్నీ జీర్ణం కావడానికి ఫర్మికుట్స్, బాక్టీరాయి డేట్స్ వంటి బ్యాక్టీరియాలు సాయపడతాయి. ఇవి తిన్న ఆహారాన్ని పులియబెట్టే ప్రక్రియలో మీథేన్ వంటి వాయువులు విడుదలౌతాయి. దాంతో ఆ మిశ్రమం ఆవుపేడ, కుళ్ళిన ఆకులు వంటి ఘాటైన వాసన ఏర్పడి హోట్జిన్ పక్షుల శరీరం నుంచి దుద్వాసన వస్తుంది. హోట్జిన్ పక్షులు ఎక్కువగా సమూహాలుగా కనిపిస్తాయి. ఇవి తమ గూళ్ళను చెట్లపై నిర్మించుకుంటాయి. వీటి పిల్లలు శత్రువుల నుండి తప్పించుకోవడానికి నీటిలోకి దూకి ఈత కొట్టగలవు.

**– షేక్ అబ్దుల్ హకీం జాని**

వాస్తువార్త


వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

సెల్స్: 9885446501/9885449458




# ‘పీడిత ద్వార దోషం’ అంటే ఏమిటి?



**ఎస్.భాస్కర్, తిరుత్తణి**

‘పీడితమ్ పీడాకరంస్యాత్’ గృహ ద్వార ‘గడప’ గృహ ద్వారబంధానికి తగినట్లుగా ఉంటే సర్వసంపదలు తోడై ఉంటాయి. ‘గడప’ ద్వార బంధానికి తగినట్లుగా గాక, హెచ్చుతగ్గులుగా ఉంటే ‘పీడిత ద్వార దోషం’ కలిగి దుష్ఫలితాలు అనుభవించవలసి వస్తుంది. ఇటువంటి దోషం కలిగిన గృహ యజమాని, లేదా అద్దెకు నివసించేవాళ్ల కూడా సదా పీడనను(టెన్షన్లు) అనుభవించవలసి వస్తూ ఉండే అవకాశాలెక్కువ. అందువల్ల ద్వార బంధాలు తయారు చేసినప్పుడే ‘గడప’ గురించి జాగ్రత్త పడాలి. ద్వారబంధపు చెక్కమందం కటే ‘గడప’ మందం హెచ్చుతగ్గులుగా ఉండకూడదు. చెక్కమందం ప్రధాన ద్వారానికి ఎక్కువగాను, మిగతా ద్వారబంధాలకు తక్కువగానూ ఉండటం సర్వసాధారణం. గృహానికి సరిపడే విధంగా ద్వార బంధం ఉండాలి. ద్వారబంధపు చెక్క మందమే గడపకు కూడా ఉండాలి. గడపనేల పైభాగముననే ప్రతిష్టింపబడాలి. బండలు, టైల్స్ వేసే సమయంలో ‘గడప’ కొంత భాగం కూడా కప్పబడి లోపలికి పోకూడదు. గడప విషయంలో ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే అనేక విధాల కష్టనష్టాల బారిన పడకుండా భద్రత పొందవచ్చు.

## అనువైనప్లాట్?

**ఎ.వజ్రలింగం, నిజామాబాద్**

**ప్రశ్న: నాకు వలిగొండలో ఒక స్వంత ఇల్లు ఉన్నది. పిల్లలు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. హైదరాబాద్‌లో రెండు ప్లాట్లు ఉన్నాయి. ఒకటి తూర్పు వీధి, మరొకటి పడమర వీధి. వలిగొండలో ఇల్లు అమ్మి హైదరాబాద్‌లో కట్టాలనుకుంటున్నాను. ఏ ప్లాట్‌లో ఇల్లు కట్టుకుంటే బాగుంటుంది?**

**జవాబు:** పడమర ముఖద్వార గృహం వ్యవహారనామ రీత్యా మీకు, మీ కుమారునికి కూడా యోగిస్తుంది. కాబట్టి పడమర వీధి ఉన్న స్థలంలో పడమర ముఖద్వార గృహం నిర్మించుకోవటమే శ్రేష్ఠం.

## ముండ్లచెట్లను తీసేయాలా?

**బి.ప్రదీప్, వనపర్తి**

**ప్రశ్న: ఈ మధ్యనే మా ఇంటికి వెనుకనున్న ఖాళీ స్థలంలో, పడమర ప్రహరీ గోడకు అవతల ఒక ముండ్లచెట్టు మొలిచి బలంగా పెరిగిపోతోంది. మాకు ఉన్నంతలో బాగానే ఉన్నాంగానీ ఈ మధ్యనే అనుకోని విధంగా వివిధ రకాల సమస్యలు వస్తున్నాయి. అందరికీ ఆరోగ్య సమస్యలు రావటం విచిత్రంగా అనిపిస్తోంది. ఈ ముండ్ల చెట్టు అసంఖ్యాకమైన ముండ్లతో దాదాపు ఆరడుగుల ఎత్తు పెరిగింది. ఇలాంటి ముండ్లచెట్టు ఉండవచ్చా? వీటిని తీసేయాలా?**

**జవాబు:** గృహావరణలో ముండ్లచెట్లు ఉండకూడదన్న వాస్తు నియమం వున్నమాట వాస్తవమే. మీ ఇంటికి పడమర వైపుకు మొలిచిన చెట్టు ఎన్నో శాఖలతో, ఎన్నో ముండ్లతో కూడి వుంటే అది గృహావరణలో పరిసరాలలో ఉండగూడని చెట్టుగా పరిగణనలోకి తీసుకోవచ్చు. గృహావరణలో తాడిచెట్లు, మర్రిచెట్లు, ఈతచెట్లు, తుమ్మచెట్లు మొదలైనవి వుండకూడదు. మీరు పేర్కొన్న చెట్టు ‘తుమ్మచెట్టు’ అయి ఉంటుంది. నిస్సందేహంగా మీరు ఆ చెట్టును తీసేయవచ్చు. ముండ్లచెట్లయినప్పటికీ నిమ్మ, గులాబీ.. మొ॥ మొక్కలు గృహావరణలో పెంచవచ్చు. మీ పరిశీలన మెచ్చుకోతగినది. ఆ చెట్టుని నిర్మూలించిన (పదిహేను రోజుల) తర్వాత మీ పరిస్థితులలో మార్పులు గురించి తెలియజేయండి. ■

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం ‘వాస్తువార్త’లో సమాధానాలిస్తారు.
ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే,
రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ..........................................
పుట్టిన తేది : ..........................................
జన్మ నక్షత్రం: ...............తల్లి పేరు: ................
చిరునామా:..........................................

# సైకిల్ కథా కమామిషూ..

సైకిల్ తొక్కడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుంది. అలాగే, ఆరోగ్యానికి మంచి జరుగుతుందనే విషయం తెలిసిందే! కానీ, ఇలాంటి మాటలన్నీ కాగితాల వరకే పరిమితమవుతున్నాయి. ప్రస్తుతం సైకిల్ తొక్కేవారి సంఖ్య చాలా తక్కువైంది. పాఠశాల స్థాయి విద్యార్థులు సైతం స్కూటీలు, బైక్‌లపై చక్కర్లు కొడుతున్నారు. మరికొందరు బద్ధకంతో తక్కువ దూరాలకు సైతం బైక్‌లు, కార్లు లాంటి వాహనాలనే ఉపయోగిస్తున్నారు. ఇలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని ఇటలీలోని 'బారీ' నగరంలో అధికారులు ఓ ప్రోత్సాహక పథకం ప్రవేశపెట్టారు. సైకిల్ మీద ఆఫీసుకు వెళ్లేవారికి నగదు పారితోషికం ఇవ్వాలని నిర్ణయించారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా సైకిల్‌పై ఆఫీసుకు వెళ్లేవారికి కిలోమీటరుకు 20 సెంట్ల పారితోషికం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. సుమారు వెయ్యి మందికి ఇందులో చేరే అవకాశం ఉంటుంది. గరిష్ఠంగా ఒక్కొక్కరికి మన కరెన్సీలో దాదాపు రెండు వేల రూపాయల వరకు చెల్లించే అవకాశముంది. అత్యధిక కిలోమీటర్లు సైకిల్ తొక్కినవారికి అదనంగా బోనస్ కూడా ఇస్తారట. దీనికోసం ఉద్యోగులు, పిల్లల కోసం తల్లిదండ్రులు సైకిళ్లు కొనేందుకు నగరపాలక సంస్థ నిధులు సైతం కేటాయించింది. సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యం మెరుగుపడడమే కాకుండా డబ్బులూ వస్తాయని నగర మేయర్ ఆంటోనియో డెకారో అంటున్నారు. నిజానికి సైక్లింగ్ ఆరోగ్యానికి ఎంతో మంచిది, మంచి వ్యాయామం కూడా. సైకిలు ఒక సాధారణమైన రవాణా సాధనం. ఇది మానవ శక్తితో నడపబడే రెండు చక్రాల వాహనం. దీనిని 19వ శతాబ్దంలో ఐరోపాలో మొదటిసారిగా ఉపయోగించారు. ప్రపంచంలో ప్రస్తుతం చైనాలో సైకిలు ఉపయోగం ఎక్కువగా ఉంది. విశ్వవ్యాప్తంగా ఇంచుమించు ఒక బిలియను సైకిళ్ళు ఉపయోగంలో ఉన్నట్లు అంచనా.



1813లో ఒకరోజు మాన్ హీమ్ అనే జర్మనీ వీధుల్లో వింత వాహనంపై వెళుతున్నాడు. ఆ వాహనంలో ఒక కొయ్య చట్రం ఉంది. దీని మధ్యలో కూర్చోవటానికి సీటు ఉంది. ఒకదాని వెనుక మరొకటి ఉండేలా రెండు చక్రాలున్నాయి. యువకుడు సీటుపై కూర్చుని కాళ్ళను నేలపై నెట్టుకుంటూ ముందుకు వెడుతున్నాడు. ముంజేతులను ఇనుప కడ్డీలపై ఉంచాడు. ముందు చక్రానికి సంబంధించిన కొయ్య కడ్డీని చేతులతో తిప్పితే పోదలచుకున్న మార్గంలో అతడు వెళ్ళగలుగుతున్నాడు.

అతను పోతున్న తీరును చూసి వీధిలో పిల్లలు కేరింతలు పెడుతూ, వాహనం వెంట పరుగులు తీశారు. అయితే అదేమీ లెక్కచేయకుండా ఆ యువకుడు ముందుకు సాగిపోతున్నాడు. అతడు బేడన్ ప్రభుత్వంలోని ఒక పెద్ద అధికారి కొడుకు. తన కొడుకు ఆఫీసర్ కావాలని తండ్రి ఆశించాడు. కానీ ఎక్కువ బాధ్యతలు నెత్తిన వేసుకోవటం ఇష్టంలేక బేరన్ డ్రే మామూలు గుమాస్తాగా చేరాడు. అతనికి కొత్త విషయాలు కనుక్కోవాలనే తపన ఎక్కువగా ఉండేది. చిన్నప్పటి నుంచి సాంకేతిక విషయాల్లో అభిరుచి, ఉత్సుకత ఉన్నప్పటికీ ఉన్నత మధ్య తరగతి కుటుంబానికి చెందినవాడు కావటం వల్ల యాంత్రిక శాస్త్రం చదవలేకపోయాడు. 1851లో దుర్భర దారిద్ర్యంలో అతడు మరణించేసరికి ఇతడు కనిపెట్టిన వాహనాన్ని రైలు పట్టాలపై వెళ్లి మరమ్మత్తులు చేయటానికి, కార్యకలాపాలు పర్యవేక్షించటానికీ, మాత్రమే ఉపయోగిస్తుండేవారు. అయితే ఇంగ్లండ్, ఫ్రాన్స్, అమెరికా దేశాల్లో పెద్ద అంగలు వేసుకుంటూ ఈ వాహనం చాలా ముందుకు సాగిపోయింది. ఈ బండి ఫ్రాన్స్, ఇంగ్లండ్ దేశాల దృష్టిని ఆకర్షించింది. ఎర్నస్ట్ మికాక్స్ అనే ఫ్రాన్స్ దేశీయుడు మొదటి సైకిలు కర్మాగారాన్ని నెలకొల్పి ఫిషర్ నమూనా ప్రకారం సైకిళ్ళను తయారు చేశాడు. ఇంగ్లండులో కూడా ఇలాంటివి తయారయ్యాయి. వీటిలో వెనక చక్రం కాస్త చిన్నదిగా ఉండేది. 1870 ప్రాంతంలో ఈ నమూనా బహుళ ప్రజాదరణ పొందింది. రాను రాను క్రీడాకారులకు దీని పట్ల మోజు పెరిగింది.

ప్రముఖ చిత్రకారుడు లియోనార్డో డావిన్సీ సైకిలును పోలిన కొన్ని బొమ్మలు గీశాడు. ఫ్రాన్స్ జాతీయుడు దిసిప్రాక్ సైకిలు లాంటి వాహనాన్ని తొలిసారిగా రూపొందించాడు. దాన్ని 'హాబీ హార్' అని పిలిచేవారు. దానికి పెడల్స్ ఉండేవి కావు.

అయితే 1840లో స్కాట్లాండ్ దేశస్తుడు కిర్క్ పాట్రిక్ మాక్మిలన్ పెడల్స్‌ను జత చేసి నిజమైన సైకిలు రూపును కల్పించాడు. తర్వాత కొన్ని మార్పులు చోటు చేసుకుని 1900వ సంవత్సరంలో ఆధునికమైన సైకిలు తయారైంది. ఐక్యరాజ్యసమితిలోని వియన్నా కన్వెన్షన్, 1968 ప్రకారం సైకిలును ఒక వాహనంగా, నడిపేవానిని చాలకునిగా గుర్తించారు. చాలా దేశాలలో దీని ప్రకారం లైసెన్సులు కూడా అమలులో ఉన్నాయి. ఏదేమైనా సైక్లింగ్ మంచి వ్యాయామమే. అలాగని సైకిల్ తొక్కడంలో అతి కూడదు. అది మంచిది కాదు.

– యామిజాల జగదీశ్

# వరప్రదాయక వినాయకుల ఆలయం

**ప్రథమ పూజ్యుడు శ్రీ వినాయకునికి హిందూ దేవాలయాలలో ఉన్న ప్రాధాన్యం వివరించలేనంత గొప్పది అని చెప్పవచ్చు. శివ, విష్ణు, దేవీ ఆలయాలు అన్న బేధం లేకుండా ప్రతి క్షేత్రంలో మొదట దర్శనమిచ్చేది ఏకదంతుడే.**

విఘ్న వినాయకుడు ఉపాలయాలలోనే కాకుండా ప్రధాన దైవంగా కొలువు తీరిన దేవాలయాలు మన దేశంలో చాలా ఉన్నాయి. కానీ తమిళనాడు రాష్ట్రం దిండిగల్ పట్టణంలో మరెక్కడా లేని విధంగా ఒకే ప్రాంగణంలో ఒకేచోట నూట ఎనిమిది వినాయక మూర్తులు ఉండటం ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

ప్రధాన వినాయక విగ్రహం ముప్పై రెండు అడుగుల ఎత్తు ఉంటుంది. పీఠంతో కలిసి యాభై అడుగుల ఎత్తైన విగ్రహంగా ప్రసిద్ధి చెందినది. దైవభక్తులు అందరినీ ఆకర్షించే ఈ దేవాలయంలో అనేక దేవతామూర్తులు కొలువై పూజలు అందుకొంటున్నారు. ఈ అరుదైన ఆలయం వెనుక వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉన్నట్లు తెలుస్తోంది.



స్థానికంగా 'సన్నై తరుమ్ నూటెట్టు వినాయక కోవిల్' అని పిలిచే ఈ ఆలయం ఒకప్పుడు చిన్న మండపం అని చెబుతారు.

## చారిత్రక గాథ

సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం స్థానిక నీటి అవసరాల నిమిత్తం ఒక పెద్ద చెఱువు తవ్వించాలని నిర్ణయించారట అప్పటి పాలకులు. చెఱువు తవ్వుతున్న సమయంలో ఒక వినాయక విగ్రహం ఏనాటిదో బయల్పడినదట. చెఱువు గట్టునే చిన్న మండపం కట్టించి, స్థానికులు పూజించడం ప్రారంభించారు. క్రమంగా భక్తులకు కలుగుతున్న అనుభవాలు, మారుతున్న వారి స్థితిగతులు స్వామివారి వరప్రదాయకుడు అన్న విశ్వాసం ప్రజలలో ఏర్పడింది.

మైసూర్ పాలకుడు టిప్పు సుల్తాన్ ఈ ప్రాంతం మీద దండెత్తిన సమయంలో అనేక ఆలయాలను నేలమట్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ విగ్రహాన్ని కూడా ధ్వంసం చేస్తారన్న భయంతో స్థానికులు చెఱువులో దాపెట్టారట. తిరిగి సామాన్య పరిస్థితులు నెలకొన్న తరువాత మరోసారి చిన్న ఆలయం నిర్మించి పునఃప్రతిష్టించారట. సుమారు మూడు దశాబ్దాల క్రితం కొందరు భక్తులు ఒక సంఘంగా ఏర్పడి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఆ సంకల్పం నుండి ఆవిర్భవించింది ఈ సంకటహర చవితి నూట ఎనిమిది వినాయక ఆలయం. దిండిగల్ పట్టణానికి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చింది.

## గోపాల్ నాయకర్

మొట్టమొదట వినాయక ప్రతిమ లభించిన చెఱువును 'గోపాల్ నాయకర్ సముద్రం' అని పిలుస్తారు. పద్దెనిమిదవ శతాబ్దంలో ఈ ప్రాంత సామంత రాజు. ఇతడు గొప్ప దేశభక్తిపరుడు. యోధుడు. ప్రజలను చక్కగా పాలించిన పాలకుడు. చాప కింద నీరులా వ్యాపారం పేరిట మన దేశంలోనికి అడుగు పెట్టి మన పాలకుల బలహీనతలను, వారి మధ్య నెలకొని ఉన్న విభేదాలను రెచ్చగొట్టి నెమ్మదిగా ఒక్కో ప్రాంతాన్ని తమ అధీనంలోనికి తెచ్చుకొన్నారు ఆంగ్లేయులు.

వారిని నిలువరించడానికి ఎందరో దేశభక్తులు తమ వంతు పోరాటం చేశారు. అలాంటి వారిలో ఒకరు గోపాల్ నాయకర్. చుట్టుపకల ప్రాంతాల పాలకులతో కలిసి ఒక కూటమిని ఏర్పాటు చేసారు.

ఆంగ్లేయుల అధీనంలో ఉన్న కోయంబత్తూర్ మీదకు రహస్య దాడికి పథకం రచించారు. కానీ కూటమిలో ఉన్న విద్రోహుల మూలంగా వీరి ప్రయత్నం విఫలమైనది. తమకు బందీలుగా దొరికిన గోపాల్ నాయకర్‌తో పాటు మరికొందరిని ఈ చెఱువు గట్టున పద్దెనిమిది వందల ఒకటో సంవత్సరంలో బహిరంగంగా ఉరి

తీశారు. అప్పటికి గోపాల్ నాయకర్ వయస్సు డెబ్భై ఏళ్లకు పైనే. గొప్ప స్వతంత్ర పోరాట యోధుని పేరిట చెరువును ఆయన పేరుతోనే పిలుస్తున్నారు. గోపాల్ నాయకర్ సముద్రం పక్కనే ఉంటుందీ విశేష ఆలయం.

## ఆలయ విశేషాలు

పడమర ముఖంగా ఉండే ఆలయ ప్రాంగణానికి చిన్న స్వర్ణవర్ణ గోపురం ఉంటుంది. చాలా చిన్న ప్రాంగణం. ఎన్నో దేవీ దేవతల సన్నిధులు కిక్కిరిసిపోయినట్లు ఉన్నా ఆధ్యాత్మిక సౌరభం వెల్లి విరుస్తుంటుంది. లోపలికి అడుగు పెట్టగానే శ్రీ గణపతి చిన్న సన్నిధిలో తూర్పు ముఖంగా దర్శనమిస్తారు. దక్షిణ ముఖంగా శ్రీ దక్షిణామూర్తి, శ్రీ మహాలక్ష్మి, శ్రీ కరుమారి అమ్మన్, శ్రీ కరుప్ప స్వామి, శ్రీ సమయపురి మారియమ్మన్, శ్రీ దుర్గాదేవి, శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీ స్వర్ణాకర్ష భైరవుడు, శ్రీ శ్రీనివాస పెరుమాళ్, శ్రీ ధర్మశాస్త, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి సన్నిధులు వరసగా ఉంటాయి.

విశేషించి కనపడే సన్నిధి ధనాధిపతి అయిన కుబేరునిది. అన్ని విగ్రహాలు నల్లరాతివి కాగా కుబేరుని విగ్రహం ప్రత్యేకంగా పాలరాతితో చేసినది కావడం ప్రత్యేకం. మధ్యలో శ్రీ అణ్ణామలై సమేత శ్రీ అణ్ణామలేశ్వర స్వామివారు విగ్రహ రూపంలో కొలువు తీరి దర్శనమిస్తారు. చైత్ర మాసంలో సూర్యకిరణాలు నేరుగా మహేశ్వరుని తాకుతాయి.

లయకారుని చుట్టూ నూట ఏడు వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించబడి ఉంటాయి. ఈ విగ్రహాలను భక్తులు తమ వంతు కైంకర్యంగా సమర్పించుకొన్నవి కావడం విశేషం.

ఎత్తైన పీఠం మీద ముప్పై రెండు అడుగుల ఎత్తు, నూటముప్పై టన్నుల బరువైన భారీ రూపంలో ప్రధాన అర్చనామూర్తి శ్రీ సంకటహర వినాయకుడు ఉపస్థితులై ఉంటారు. ఎదురుగా నాలుగు టన్నుల బరువైన మూషిక అనుంజుడు పక్కనే చిన్న ధ్వజస్థంభం కనిపిస్తాయి.

## మూల విరాట్టు విశేషాలు

నల్ల ఏకరాతి శిల మీద జీవం ఉట్టిపడేలా మలన విఘ్ననాథుని రూపం నేత్రపర్వంగా ఉండటమే కాదు కొన్ని ప్రత్యేకతలతో కనిపిస్తుంది. చతుర్భుజాలతో, ఉపస్థిత భంగిమలో మందస్మిత వదనంతో వరదాభయప్రదునిగా దర్శనమిస్తారు. స్వామివారి తొండం కుడి పక్కకు తిరిగి ఉండి కలశాన్ని పట్టుకొని ఉంటుంది. కుడి పకకు తిరిగిన తొండంతో ఉన్న గణపతిని 'వెట్రి వినాయక' అని పిలుస్తారు.



అత్యంత శీఘ్రంగా భక్తుల మొరలను విని వారి సంకటాలను దూరం చేస్తారని విశ్వసిస్తారు.

స్వామి కిరీటం మీద గంగాధరుడు కొలువై ఉండటం మరొక విశేషం. మరెక్కడా చూడని అరుదైన రూపంగా చెప్పాలి. భక్తుల పాపాలను, కష్టనష్టాలను పవిత్ర గంగా జలంతో తొలగించేవాడని చెబుతారు. అందుకు తగినట్లుగా ఇందరు దేవీదేవతలు కొలువైన ఈ క్షేత్రం ఇన్ని సంవత్సరాలుగా భక్తులకు లభించిన అనుభవాలతో ఒక పరిహార స్థలంగా రూపుదిద్దుకొన్నది.

## పరిహార క్షేత్రం

సంవత్సరంలో ఏ రోజైనా అవివాహితులు ఆది దంపతులకు రెండు పూలమాలలు సమర్పించుకొంటే మండలం రోజులలో అనుకూల వ్యక్తితో వివాహం జరుగుతుంది. సంతానం లేని దంపతులు పెరుగుతో మూలవిరాట్టుకు ముఖ్యంగా చవితి నాడు అభిషేకం చేస్తే త్వరలో సంతానం కలుగుతుంది. ప్రతి నెలా చవితి తిథులలో ముఖ్యంగా 'వినాయక చవితి'నాడు పెద్ద సంఖ్యలో దంపతులు దధి అభిషేకం చేయడానికి వస్తారు. రాహుకేతు, నాగదోషం తొలగిపోడానికి శ్రీ సుబ్రహ్మణ్య స్వామికి అర్చన, ధన నష్టం ఆగడానికి శ్రీ కుబేర పూజ, రుణ బాధలు తొలగిపోడానికి శ్రీ స్వర్ణకర్ష భైరవ పూజ జరిపించుకోడానికి ప్రతిరోజూ ఎందరో భక్తులు వస్తుంటారు. అన్ని పర్వదినాలను ఘనంగా నిర్వహిస్తారు. చుట్టుపక్కల జిల్లాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. గణపతి నవరాత్రుల సందర్భంగా ఆఖరి రోజున జరిగే రథోత్సవం కన్నుల పండుగగా ఉంటుంది.

## ఎలా వెళ్లాలి?

అరుదైన వర ప్రదాయక నూట ఎనిమిది వినాయక ఆలయం దిండిగల్ బస్టాండ్ /రైల్వే స్టేషన్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సమీపంలోనే మరో చరిత్ర ప్రసిద్ధి చెందిన శ్రీ అభిరామి అమ్మన్ ఆలయం ఉంటుంది. దిండిగల్ బస్సు స్టాండ్ సమీపంలో అందుబాటు ధరలలో వసతి, భోజన సౌకర్యం లభిస్తుంది. దిండిగల్‌కు మన తెలుగు రాష్ట్రాల నుండి రైలు సదుపాయం లభిస్తుంది. దిండిగల్ పట్టణంలో నాయక రాజులు నిర్మించిన కోట తప్పనిసరిగా చూడవలసిన జాబితాలో చేర్చుకోవాలి.

– ఇలపావులూరి వెంకటేశ్వర్లు

# 30 నవంబరు, 2025 నుండి 6 డిసెంబరు, 2025 వరకు



## వారఫలం


శ్రీమతి ములుగు శివజ్యోతి,ప్రముఖ జ్యోతిష్కురాలు

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం

ఈ వారం కొత్త కార్యకర్తలను చేర్చుకుంటారు. నూతన కార్యక్రమాలను స్నేహితులతో ప్రారంభిస్తారు. సహ ఉద్యోగులు సహచర బృందం మీకు అనుకూలంగా ఉంటారు. మీరు చెప్పిన పనులు చేసి పెడతారు ప్రయోజనాలను మాత్రం ఆశించరు. అరటి నార వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. దూర ప్రాంత ప్రయాణాలు కలిసి వస్తాయి. విదేశాలలో స్థిరత్వం కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

### వృషభం

ఈ వారం శత్రు వర్గాన్ని పూర్తిగా నిర్మూలించలేనప్పటికీ పక్కకి పారద్రోల గలుగుతారు. కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలకు అయిన వాళ్ళు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు ముందుగానే గ్రహించి వాళ్ళకి ఇవ్వవలసినటువంటి ప్రయోజనాలు,లాంఛనాలు, వాళ్ల కప్పగించి వాళ్ళ నోర్లు మూయించగలుగుతారు. మీరు చాకచక్యంగా సమయస్ఫూర్తితో నెమ్మదిగా హుందాగా వ్యవహరించ గలుగుతారు. అరటి నార వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి.

### మిథునం

ఈ వారం కొంతమంది వ్యక్తుల ప్రవర్తన మీకు నచ్చక కొన్ని నిర్ణయాలను వెనువెంటనే తీసుకుంటారు. దూరప్రాంత ప్రయాణాలు కలిసి వస్తాయి. కాపురంలో చిచ్చు పెట్టే వారిని గుర్తిస్తారు. వీరి పట్ల మీ ప్రవర్తన మారుతుంది. ఇలాంటి వాళ్ళకి అవకాశం ఆశ్రయము ఇవ్వకూడదు అని నిర్ణయం తీసుకుంటారు. అరటి నార వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి.

### కర్కాటకం

ఈ వారం ఉద్యోగంలో మార్పులు ఏర్పడతాయి. ఇందుమూలంగా ఉద్యోగం మారాలన్న ఆలోచనలు అధికంగా ఉంటాయి. కొంతమంది వ్యక్తుల ప్రవర్తన బాధకి భాగోద్వేగానికి కారణమవుతుంది. స్నేహితుల సహాయం సహ ఉద్యోగులు సహాయం కొంతమేరకు మాత్రమే ఉపయోగపడుతుంది. శ్రీ లక్ష్మి చందనంతో సుబ్రమణ్య స్వామి వారికి అభిషేకం జరిపించండి . ఆలోచనలలో మార్పులు ఏర్పడతాయి.

### సింహం

ఈ వారం సహోదర సహోదరీ వర్గంతో మాట పట్టింపులు ఏర్పడకుండా జాగ్రత్తలు వహించండి. బాధ్యతలను సక్రమంగా నిర్వహించి గలుగుతారు. ముఖ్యమైన శుభకార్యాలు ప్రస్తావనలు విజయవంతంగా జరుగుతాయి. సౌర కంకణాన్ని ధరించండి ఆరోగ్యం మెరుగు పడుతుంది. మీ పేరు మీద ఉన్న స్థిర చరాస్తులు విలువ గణనీయంగా పెరుగుతుంది. కొన్ని సందర్భాలలో వాటిని అమ్మి వేసి మరొకచోట భూములు కొనుగోలు చేయాలి అన్న ఆలోచనలు కలిగి ఉంటారు.

### కన్య

ఈ వారం నూతన వస్తువులు వస్త్రాలు కొనుగోలు చేస్తారు. ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా గాని రాజకీయాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. కొన్ని పదవుల కోసం ప్రయత్నం చేయాలని భావిస్తారు. కొత్తగా పరిచయమైన వ్యక్తులకు ఇట్టి విషయాలను తెలియనివ్వవద్దు.

### తుల

ఈ వారం సొంత ఉపాధి ఉన్నవారికి కాలం అనుకూలంగా ఉంటుంది. ప్రజాకర్షణ ఏర్పడుతుంది. చేస్తున్న పనులలో ఎన్నో మార్పులు తీసుకోగలుగుతారు. ప్రేమ వివాహాలు కలసి రావు. మీ పేరు మీదున్న ఇన్స్టిట్యూట్ కోచింగ్ సెంటర్ వ్యాపార కేంద్రాలుకు మంచి పేరు ఆదాయం లభిస్తుంది. సర్వ రక్ష చూర్ణము సర్పదోష నివారణ చూర్ణము కలిపి స్నాన మాచరించండి. వాహన ప్రయాణాల్లో జాగ్రత్త వహించండి.

### వృశ్చికం

ఈ వారం సుదీర్ఘమైన ఫోన్ సంభాషణల ద్వారా వ్యక్తిగత విషయాలు బయటకు జారుకుంటాయి. అప్రమత్తంగా వ్యవహరించండి. స్థిరచరాస్తులకు సంబంధించిన ముఖ్యమైన వ్యవహారాలు విషయాలు నత్తనడకన సాగుతాయి. అయిన వాళ్ళతో విభేదాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ఓం నమశ్శివాయ వత్తులతో అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. నూతన ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

### ధనస్సు

ఈ వారం ఇంటర్వ్యూలలో అనకూల ఫలితాలు సాధిస్తారు. ఎదురుచూడని అవకాశాలు కలిసి వస్తాయి. వాటిని నేర్పుగా ఉపయోగించుకోండి. గోశాలలో గరిక దానం చేయండి. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. విదేశీ అవకాశాల కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి విదేశాలలో ఉన్నవారికి సొంత ఇంటి కల నెరవేరుతుంది. సంతానం పట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తారు. కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు శ్రేయస్కరం.

### మకరం

ఈ వారం మొండి మనుషులను సైతం మార్చగలగుతారు. కార్యాలయంలో మార్పులు ఏర్పడతాయి. వాటిని మీకు అనుకూలంగా మార్చుకోవడానికి మరి కాస్త వ్యవధి పడుతుంది అని గ్రహిస్తారు. రాజకీయ స్నేహాలు బలపడుతాయి. మీ ఇష్టదేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చేయడండి. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. రెన్యువల్స్ కోసం దరఖాస్తులు దాఖలు చేస్తారు. శుభవార్త వింటారు. ఆదాయమార్గాలు తెరుచుకుంటాయి.


### కుంభం


ఈ వారం కోర్టు వ్యవహారాలు వాయిదాలలో ఉంటాయి. నరదృష్టి అధికంగా ఉంటుంది. డ్రైవింగ్‌లో జాగ్రత్తలు అవసరం. కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా కాలాన్ని గడపగలుగుతారు. రచన ప్రాధాన్యంగా కలిగినటువంటి రంగంలోని వారికి నూతన అవకాశాలు లభిస్తాయి. నానారకాలు అరిష్టాలు, చికాకులు పోవడానికి, శత్రు బాధలు, బాధలు నశించడానికి త్రిశూల్‌ని ఉపయోగించండి. ఇది అత్యంత శక్తివంతమైనది.

### మీనం

ఈ వారం వాణిజ్య ప్రకటనలు, పేపర్లలో ప్రకటన, ద్వారా ప్రయోజనాలను దక్కించుకుంటారు. వ్యాపార అభివృద్ధి దిశలో ఉంటుంది. ఆదాయాన్ని అందుకోగలుగుతారు. బ్యాంకు ట్రాన్సాక్షన్స్ విషయంలో అప్రమత్తంగా ఉండండి. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. స్థలాల అమ్మకాలు కొనుగోలు విషయంలో కొత్త ఆలోచనలను ప్రవేశపెట్టి లాభపడతారు.

# ఈ వారం కార్టూన్స్


అందరూ లీక్స్ చేసి బాగా సంపాదిస్తున్నారని
నన్ను లీక్స్ చేయమని ఇబ్బంది పెడుతున్నారే?!


కలెక్టర్ తెక్కున్నావు.. చిప్ప లాగుతుంది బిడ్డా!!


IIT, IAS కాదంట్రీ.. పైరసీ, హ్యాకింగ్, స్మగ్లింగ్!!
కోచింగ్ సెంటర్



పచ్చటి ప్రకృతి మధ్యలో వరుసగా త్రికోణాకారంలో ఉన్న ఇళ్ల సముదాయం హంగేరిలోని హర్‌సెగ్‌కూట్ అనే గ్రామంలోనివి. ఒక్కో ఊరు ఒక్కో ప్రత్యేకతను సంతరించుకుంటుంది. వైవిధ్యంగా వున్న ఈ ఇళ్ల సముదాయం వల్ల ఈ ఊరు పర్యాటక ప్రాంతంగా మారింది.

